
RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 25 ISSUE NO : 25 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | శుక్రవారం, జూలై, 11 , 2025 Friday, July,11, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



సాయిబాబా ఆలయల్లో..

## భక్తుల రద్దీ

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి సందడి నెలకొంది. గురువారం తెల్లవారుజాము నుంచే సాయిబాబాను దర్శిం చుకునేందుకు భక్తులు క్యూకట్టారు. దీంతో ఆలయాలన్నీ భక్తులతో రద్దీగా మారిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు చేరుకొని సాయిబాబాను దర్శించుకుంటున్నారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, దిల్‌సుఖ్‌నగర్, పంజాగుట్టతోపాటు హైదరాబాద్‌లోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. సాయినాథుడిని దర్శించుకొని తన్మయానికి గురయ్యారు.



ఢిల్లీ,: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విదేవీ పర్యటన ముగించు కుని తిరిగి భారత్ చేరుకున్నా రు. ఆయన 8 రోజుల పాటు ఐదు దేశాల్లో పర్యటించారు. ఇందులో ఘూనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటినా, బ్రెజిల్, నమిబియా దేశాలు ఉన్నాయి. ఈ పర్యటనలో భాగంగా ఆయన బ్రెజిల్‌లో జరిగిన 17వ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు.

విదేశీ పర్యటన ముగించుకుని

## భారత్ చేరుకున్న ప్రధాని మోడీ




బ్రెజిల్‌పై 50 శాతం

సుంకాలు విధించిన

## ట్రంప్

వాషింగ్టన్: బ్రిక్స్ కూటమి దేశాలపై అదనంగా ప్రతీకార ప్రతీకార సుంకా లు విధిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశా రు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చిన బ్రెజిల్‌పై 50 శాతం సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే దీనికి ఆ దేశ మాజీ అధ్యక్షుడు బోల్సోనారోను వేధిస్తున్నారనే కారణం చూపారు. బోల్సోనారో పట్ల వ్యవహరిస్తున్న తీరు బాగోలేదంటూ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా ద సిల్వాకు రాసిన లేఖలో ట్రంప్ పేర్కొన్నారు. అదేవిధంగా బ్రెజిల్ అనుసరిస్తున్న వాణిజ్య పద్ధతులపై దర్యాప్తు చేపడతామని తెలిపారు.

ఢిల్లీ,: యూరప్‌లోని అత్యున్నత మానవ హక్కుల కోర్టు తాజాగా సంచలన తీర్పు వెలువరించింది. మలేషియా ఎయిర్‌లైన్స్ విమానం %వీఎ%17ను కూల్చింది రష్యానే అని పేర్కొంది. అంతేకాదు ఉక్రెయిన్‌లో దశాబ్ద కాలంగా మాస్కో దురాగతాలకు పాల్పడిందని ఆరోపిస్తూ కీవ్, నెదర్లాండ్స్ దాఖలు చేసిన మరో మూడు కేసుల్లో యూరోపియన్ మానవ హక్కుల కోర్టు రష్యాకు వ్యతిరేకంగా తీర్పులు వెలువరించింది. 2014, జులై 17న ఆమ్‌స్టర్‌డామ్ నుంచి కౌలాలంపూర్ వెళ్తున్న మలేషియా ఎయిర్‌లైన్స్ 17ను ఉక్రెయిన్ భూభాగం పైనుంచి రష్యా క్షిపణిని వినియోగించి మాస్కో అనుకూల తిరుగుబాటుదారులు కూల్చేసిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 283 మంది ప్రయాణికులు, 15 మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు రష్యా నిర్మిత బక్ క్షిపణితో ఈ దాడి జరిగిందని తేల్చింది. 'ఉద్దేశపూర్వకంగానే విమానం పై దాడి చేశారని, బహుశా అది సైనిక విమానంగా భావించి ఉండొచ్చని ఆధారాలు సూచిస్తున్నాయి' అని స్ట్రాస్‌బర్గ్ కోర్టు తెలిపింది. ఈ ఘటనపై తన ప్రమేయాన్ని రష్యా నిరాకరించడం అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని కోర్టు పేర్కొంది.



మలేషియా విమానాన్ని కూల్చింది

## రష్యానే

యూరప్ కోర్టు




తల్లిదండ్రులకు

## పాదపూజ..

హాజరైన కేంద్ర మాజీ మంత్రి

ఝరాసంగం : భారతీయ సంస్కృతిలో తల్లిదండ్రులు కేవలం సంరక్షకులే కాదు, వారు మొదటి గురువులు, దేవతలు. "మాతృ దేవో భవ, పితృ దేవో భవ" అనే సూక్తిని అక్షర సత్యం చేస్తూ సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ వేద పాఠశాల నిర్వాహకులు బుధవారం వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా వేద పాఠశాల విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మాజీ మంత్రి భగవంత్ ఖుబా హాజరయ్యారు. జ్యోతిర్లింగాలకు, దత్తాత్రేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఓర్వకల్లు వద్ద ఘోర రోడ్డు

## ప్రమాదం..

ముగ్గురు మృతి

ఓర్వకల్లు : కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకంది. గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ ను స్కార్పియో వాహనం వెనుక వైపు నుంచి ఢకొట్టింది.. ఈ ప్రమాదంలో కమల్ భాష (50), మున్నా (35), షేక్ నదీయా (3) మృతిచెందారు. మరో ఆరుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. గాయాలైన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఓర్వకల్లు పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్..

సినీ సెలబ్రిటీలకు

## ఈడి నోటీసులు

హైదరాబాద్: బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులోకి ఈడీ ఎంటరైంది. విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్ సహా 29 మంది సినీ ప్రముఖులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసు నమోదు చేసింది. హైదరాబాద్, సైబరాబాద్ పోలీసులు నమోదుచేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ కేసు నమోదుచేసింది. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన ప్రముఖ తెలుగు నటులు రానా దగ్గుబాటితో పాటు మంచు లక్ష్మి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, ప్రణీత, నిధి అగర్వాల్, శ్రీముఖి, రీతూ చౌదరి, యాంకర్ శ్యామల, అనన్య నాగళ్ల తదితరులపై కేసు నమోదు చేశారు. ఇక సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్లలో నీతూ అగర్వాల్, విష్ణు ప్రియ, వర్షిణి, సిరి హనుమంతు, వసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పద్మావతి, పండు, ఇమ్రాన్ ఖాన్, హర్ష సాయి, బయ్యా సన్నీ యాదవ్, టేస్టీ తేజ, బండారు సుప్రీత వంటి పేర్లు ఉన్నాయి.



కాణిపాకం ఆలయంలో..

## ఘోర అపచారం

అధికారులు, కాంట్రాక్టర్లపై భక్తుల ఆగ్రహం

కాణిపాకం : కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి పుణ్యక్షేత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పేరుగాంచిన ఆల యం. ఇక్కడ స్వయంభుగా కొలువైన గణపతిని దర్శించు కునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుం టారు. కానీ, ప్రస్తుతం అక్కడి అధికారులు, కాంట్రాక్టర్ల తీరు ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చిపెడుతోంది.

తాజాగా, ఆలయ మూల విరాట్ వరసిద్ధి వినాయక స్వామి వారికి క్షీరాభిషేకం చేసేందుకు భక్తులు టోకెన్ తీసుకున్నారు.అనంతరం అభిషేకానికి పాలు సప్లయ్ చేసే కాంట్రాక్టర్ భక్తులకు పాలు ఇవ్వగా అవి విరిగిపోయి దుర్వసన వస్తున్నాయి.

దీంతో వారు పాడైపోయిన పాలతో స్వామి వారికి అభిషేకం చేయడం ఏంటని ప్రశ్నించారు. ఏం కాదు.. దేవుడికే కాదా అని ఉచిత సలహాలు ఇచ్చారని భక్తులు మండిపడ్డారు.




కోహీర్ మున్సిపాలిటీలో

## మార్పేది..?

ఐదు నెలల్లో నలుగురు కమిషనర్లు..!

కోహీర్, జూలై10: గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ప్రకటించడంతో తమ సమస్యలు తీరుతాయని సంతోషపడ్డ పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. కోహీర్ గ్రామ పంచాయతీలో 21వేలకు పైగా జనాభా ఉండడంతో జనవరి 27వ తేదీన మున్సిపాలిటీగా ప్రకటించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, ఇతర అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని దీంతో తమ సమస్యలు తీరుతాయని అనుకున్న ప్రజలకు ఎదురు చూపులు తప్పడం లేదు. జనవరి 28న ఉమామహేశ్వర్‌రావు కోహీర్ పట్టణ తొలి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కానీ ఆయన ఫిబ్రవరి 16వ తేదీ వరకు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహించారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మున్సిపల్ అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కొత్త మున్సిపాలిటీ అయిన ఐదు నెలల్లో నలుగురు కమిషనర్లు ఇక్కడకు వచ్చి చేసేదేమీలేక తిరిగి వెళ్లారు. ఉమామహేశ్వర్‌రావు జనవరి 28 నుంచి ఫిబ్రవరి 16వ తేదీ వరకు కోహీర్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. తర్వాత వెంకట్‌రెడ్డి మార్చి 18వ తేదీ వరకు కార్యాలయ విధులకు హాజరయ్యారు. ఆయన బదిలీ కావడంతో మున్సిపల్ కమిషనర్‌గా రమేశ్‌కుమార్ బాధ్యతలను చేపట్టారు. కానీ అతడు కూడా మార్చి 4వ తేదీ వరకు మాత్రమే ఇక్కడ పని చేశారు. అతడు తాండూర్ వెళ్లిపోవడంతో కొత్త కమిషనర్‌గా ప్రకాశ్ విధుల్లో చేరారు. అతడిని కూడా సీడీఎంఏ హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త కమిషనర్ వచ్చే వరకు కోహీర్‌లోనే విధులు నిర్వహించాలని మౌఖికంగా సూచించారు. కానీ ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో ఆయన మాత్రం జూన్4వ తేదీన దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లిపోయారు.

దీంతో నెల గడిచినా కొత్త కమిషనర్‌ను నియమించలేదు. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా సమస్యలు దర్శనమిస్తున్నాయి. సీసీ రోడ్లపై మురుగు నీరు, రోడ్ల పక్కన చెత్త కనిపిస్తున్నది.

# రోడ్డు ప్రమాదాల నివారణ కోసం చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలి

## - మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా



**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 10, (తెలంగాణ దిశ)** :చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి రోడ్డు ప్రమాదాలను నివారించడమే కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడ వచ్చునని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా రోడ్డు భద్రత కమిటీ ఛైర్మన్ రాధిక గుప్తా అన్నారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ మిని మీటింగ్ హాల్ లో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి అదనపు కలెక్టర్ హాజరయ్యారు. జిల్లాలోని సమస్యాత్మకమైన, మరమ్మత్తులు అవసరమైన రోడ్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అదనపు కలెక్టరు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలను పరిష్కరించి రోడ్డు ప్రమాదాలను నివారించడమే కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడవచ్చునని అన్నారు. గత సమావేశంలోని సమస్యలను ఎంత వరకు పరిష్కరించారు, ఇంకాఎన్ని పెండింగ్ లో ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట ఎలక్ట్రిక్ పోల్స్ ను షిఫ్ట్ చేసి రోడ్డు విస్తీర్ణం పెంచాలని సూచించారు. రోడ్డుకు ఇరు వైపుల ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి అక్కడ అవసరమైన నివారణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగించాలని, అవసరమైన చోట స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్న చిన్న మరమ్మత్తులను మున్సిపల్ కమీషనర్లు తమ వద్ద ఉన్న నిధులతో పూర్తి చేయాలని సూచించారు. రోడ్ల పై వర్షం నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్ల పై ఎక్కువ ప్యాచ్ వర్క్స్ చేయకుండా అవసరమైన మేరకు కొత్త రోడ్లను నిర్మించాలని తెలిపారు.రోడ్ల నిర్వహణకు గాను భారీ మరమ్మత్తులకు, నిర్మాణలకు అవసరమైన మంజూరు అనుమతులను సంబంధిత శాఖల అధికారుల ద్వారా తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులకు పరిహారం ఎంత మందికి అందాయి, ఇంకా ఎంత వరకు పెండింగ్ లో ఉ




న్నవని అదనపు కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు భద్రత సమస్యలపై మున్సిపల్ అధికారులకు తగు సూచనలు సలహాలను ఆమె అందించారు. జిల్లాలో రహదార్లపై ప్రమాదాలు తగ్గించడానికి ట్రాఫిక్ పోలీసు వారితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్లను అదనపు కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రోడ్లు, భవనాల అధికారి, జిల్లా రవాణా అధికారి, ట్రాఫిక్ అదనపు డిసిపి, ఎసిపి సైబరాబాద్, కూకట్ పల్లి, మేడ్చల్, మునిసిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా మందిర్‌లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



శేరిలింగంపల్లి, జూలై 10 (తెలంగాణ దిశ) : గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ఆయా సాయిబాబా మందిర్లలో పీఏసీ ఛైర్మన్ అరికపూడి గాంధీ పాల్గొని పూజలు నిర్వహించారు. కూకట్ పల్లి డివిజన్ లోని ఆస్ బేస్టాస్ కాలనీలోని సాయిబాబా దేవాలయం, హైదర్ నగర్ డివిజన్ లోని భాగ్యనగర్ కాలనీ సాయిబాబా మందిర్, హాఫీజ్ పేట డివిజన్ మదీనగూడ రామకృష్ణ నగర్ కాలనీలోని ఉమామహేశ్వర స్వామి, షిరిడీ సాయిబాబా ఆలయాల్లో జరిగిన పూజల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ గాంధీ మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగించి జ్ఞాన మార్గంలో ముందుకు నడిపే జ్ఞాన దాతలైన గురువులకు గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయా చోట్ల జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎర్రగుండ్ల శ్రీనివాస్, అస్ బేస్టాస్ కాలనీ ప్రసిడెంట్ నరేష్, సైదేశ్వర్ రావు, రామలింగేశ్వర్ రావు, సుప్రజ, ప్రవీణ్, రాఘవరావు ఇతర భక్తులు పాల్గొన్నారు.

# బిజెపిని సంస్థాగతంగా మరింత పటిష్టం చేయాలి

## - హైదర్ నగర్ డివిజన్ సమావేశంలో రవికుమార్ యాదవ్




**శేరిలింగంపల్లి, జూలై 10, (తెలంగాణ దిశ):** ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎదుగుదలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మారబోయిన రవికుమార్ యాదవ్ పిలుపు నిచ్చారు. కార్యకర్తలు తలపెట్టిన ప్రతి కార్యక్రమంలో పాల్గొని నా వంతు తోడ్పాటును అందిస్తానని అన్నారు. హైదర్ నగర్ డివిజన్ నూతన కార్యవర్గ సమావేశం ఆదిత్య నగర్ కమ్యూనిటీ హాల్ లో డివిజన్ అధ్యక్షులు అరుణ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవికుమార్ యాదవ్, డివిజన్ ఇంచార్జీ బుచ్చిరెడ్డి, కో- కన్వీనర్ మణి భూషణ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు,



డివిజన్ లోని సీనియర్ నాయకులు పాత, కొత్త అనే తేడా లేకుండా అందరూ కలిసి మెలిసి పని చేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ స్థానిక సమస్యలపై దృష్టి సారించి రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగర వేసే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని రవి కుమార్ యాదవ్ పిలుపు నిచ్చారు. అంతేకాకుండా డివిజన్ లో అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాటలు తప్ప చేతలు శూన్యమన్నారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ అవలంబించిన తీరు గానే కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తుందని అన్నారు. పేద ప్రజలకు, నిరుద్యోగులకు, మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను, ఆరు గ్యారంటీలను అర్థమయ్యే రీతిలో తెలియపరచాలని కోరారు. 11 సంవత్సరాల పాలనలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాయంలో పొందుతున్న లబ్ధిని, అభివృద్ధిని కరపత్రాల ద్వారా గడప గడపకు తీసుకువెళ్లి, రానున్న రోజుల్లో భారతీయ జనతా పార్టీ జెండా ఎగుర వేసే విధంగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఉచిత రాత పుస్తకాల పంపిణీ



**కాప్రా, జూలై 10, (తెలంగాణ దిశ)** :వాసవి మిత్ర మండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో దాతల సహకారంతో వంపుగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాత పుస్తకాల పంపిణీ ముఖ్య అతిధిగా కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజ్ గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్త కార్య నిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త సహకరించిన దాతలు పెద్ది నాగరాజు గుప్తా, అమర కృష్ణ గుప్త, అనుములు నర్సింగ్ రావు గుప్త, బచ్చు నగేష్ గుప్త, రాయల శ్రవణ్ కుమార్ గుప్త, రాయికంటి ముత్యాల గుప్త, ఉప్పల శ్రీనివాస్ గుప్త, చందా సంతోష్ గుప్త, కూర శ్రీనివాస్ గుప్త, ఎనిశెట్టి మురళి గుప్త, విబివి కృష్ణ గుప్త, వైవియు నాగేశ్వరరావు గుప్త, మాచర్ల హనుమంతరావు గుప్త, లింగా రామచంద్ర గుప్త, చంద్రగిరి తారకేశ్వర్ గుప్త, బెల్దే భగవాన్ గుప్త, దిడిగం కైలాసం గుప్త, రాయల సంతోష్ గుప్త, అర్థం శ్రీనివాస్ గుప్త, జగ్గయ్య గారి బాలలింగం గుప్త, రాజూరి



జగదీష్ గుప్తా బిల్దే నాగరాజు గుప్త, సముద్రాల హరినాథ్ గుప్త, ఉపాధ్యక్షులు కార్యదర్శి బాచెల్లి నవీన్ గుప్త, కార్యవర్గ సభ్యులు కందే శివగుప్త, రాజకీయ నాయకులు కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజు, చర్లపల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, కొత్త అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# భక్తి శ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు..

## - కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి, జూలై 10, (తెలంగాణ దిశ) :** శేరిలింగంపల్లి డివిజన్ లోని తారానగర్, రాజీవ్ గృహకల్ప, గచ్చిబౌలి డివిజన్ లోని నేతాజీనగర్ తదితర కాలనీలలోని సాయిబాబా మందిరాలలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ పిలుపు మేరకు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. తెల్లవారు జాము నుండే సాయిబాబా దేవాలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. ఏది ఆశించకుండా గురువు తన శిష్యుడికి విద్యను నేర్పిస్తారు. దాంతో శిష్యుడు తన సర్వస్వం గురువుకే అంకితం చేస్తాడు. ఇదీ గురు శిష్యుల సంబంధం, ఏ రకమైన పేగుబంధం లేని పరమాత్మ సంబంధమని పేర్కొన్నారు. గురువులను ప్రతి విద్యార్థి గౌరవించుకునే ందుకు కృషి చేయాలని, అప్పుడే సంస్కారవంతమైన విద్య లభిస్తుందని వివరించారు. విద్యార్థులు గురువు బాటలో నడిస్తే భవిష్యత్‌లో ఉ



న్నత శిఖరాలను అందుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వీరేశం గౌడ్, వార్డు మెంబర్ శ్రీకళ వెంకటేశ్వర్లు, నారాయణ, లక్ష్మణ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, బసవయ్య, మనోజ్, శ్రీనివాస్, కుమార్, మహేందర్, షఫీ మహిళలు చంద్రకళ, లక్ష్మి, కుమారి, సుధారాణి, గంగ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ స్థాయి ఫలితాలు సాధించాలి

## ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



**నాగారం, జూలై 10, (తెలంగాణ దిశ)** :నాగారం మాజీ వార్డు సభ్యులు గౌరక్క సత్యం సాగర్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 350 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశపెట్టిన ఆంగ్ల భాష కు విద్యార్థులు ఆకర్షితులై అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. జన్మదిన వేడుకలను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల మధ్య నిర్వహించుకుని




విద్యార్థులకు బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కార్పొరేట్ స్థాయి ఫలితాలు సాధించాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి మార్కులు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి అభినందన మహదానందం

## - ఎన్ఎఫ్ సి విశ్రాంత సీఈఓ కంభంపాటి బలరామమూర్తి





**కుషాయిగూడ, జూలై 10, (తెలంగాణ దిశ)** :అణు ఇంధన సంస్థ (ఎన్ఎఫ్ సీ)లో సేవలందించి పదవి విరమణ పొందిన తనను గురు పౌర్ణమి సందర్భంగా శివ సాయినగర్ కుటుంబాల సముచిత సత్కారం మహదానందంగా ఉందని ఎన్ఎఫ్ సీ రిటైర్డ్ సీఈఓ, సీనియర్ సైంటిస్ట్ కంభంపాటి బలరామమూర్తి సంతోషం వ్యక్తం చేశారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం శివ సాయినగర్ శివ సాయి దేవాలయ సమావేశ మందిరంలో ఎన్ఎఫ్ సీ రిటైర్డ్ సీఈఓ బలరామమూర్తిని శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ కుటుంబాలు, భక్తులు, కమిటీ సభ్యులు చూపిన అభినందన జీవితకాలం తన మదినిండా మెదులుతూనే ఉంటుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య (సిసిఎస్) అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, శివ సాయి నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొండగళ్ల అశోక్, చక్రపాణి, శ్రీరాములు, రమేష్ రావు,ఆష్టం కృష్ణారెడ్డి, బాణాల రామకృష్ణారెడ్డి, షాబాద్ దామోదర్ రెడ్డి, వల్లభనేని శ్రీనివాస గాంధీ, మహేష్ కుమార్, సత్యనారాయణ రెడ్డి, బత్తుల రాజిరెడ్డి, సరికొండ రమేష్, సత్యనారాయణ, నిర్మల నాందేవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు లబ్ధిదారులందరూ ఈ కెవైసీ పూర్తి చేసుకోవాలి

**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 10, (తెలంగాణ దిశ)** :జిల్లాలోని 'రేషన్ కార్డు' లబ్దిదారులు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రేషన్ కార్డు దారులను వేలిముద్రల సహాయంతో వంద శాతం ఈ కెవైసీ పూర్తిచేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 537810 కార్డులలోని 1865353 మంది లబ్దిదారులకు గాను 1319111 (70.72%) లబ్దిదారులు మాత్రమే ఈ కెవైసీ పూర్తి చేసుకున్నారని, మిగిలిన 546242 (29.28%) లబ్దిదారులు ఈ కెవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో మిగిలిన 546242 'రేషన్ కార్డు' లబ్దిదారులు, 5 సంవత్సరాల వయసు పూర్తి చేసుకున్నవారు సెప్టెంబర్ నెలకు సంబంధించి తమ యొక్క తదుపరి రేషన్ పొందుటకు వెంటనే (జూలై, ఆగష్టు) వారి యొక్క నివాస ప్రాంతంలో అందుబాటులో ఉన్న రేషన్ షాపుకు వెళ్ళి ఈ కెవైసీ తప్పక పూర్తి చేసుకోవాలని కోరారు. ఐదు సంవత్సరాల వయసు పూర్తి కాని పిల్లలకు ఈ కెవైసీ నుండి మినహాయింపు ఇస్తున్నట్టు తెలిపారు. రేషన్



షాపు డీలర్లు కూడా వారి యొక్క రేషన్ షాపులను తెరిచి ఉంచి ఈ కెవైసీ పూర్తి చేసేందుకు సహకరించాలని సూచించారు.

# కొండాపూర్ లో ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

**శేరిలింగంపల్లి, జూలై 10, (తెలంగాణ దిశ) :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాజరాజేశ్వరి నగర్ కాలనీ సాయిబాబా మందిర్ లో గురువారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ రవీంద్ర ముదిరాజ్, స్థానిక నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికి సాయిబాబా ఆశీస్సులు ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రవీంద్ర ముదిరాజ్, సీనియర్ నాయకులు శుద్ధపల్లి విజయ కృష్ణ, శ్రీకాంత్ గౌడ్, కొల్లూరి, మధు ముదిరాజ్, రమేష్ ముదిరాజ్, అజయ్, సత్యేందర్ సింగ్ సంతోష్ కుమార్, రాజేష్ యాదవ్, మురళి మోహన్,రాజేష్ యాదవ్, కచ్చావా దీపక్ తదితరులు పాల్గొన్నారు.




# బిసి గురుకులాల్లో అతిథి ఉపాధ్యాయ ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానం

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, జూలై 10, (తెలంగాణ దిశ) :**
ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాలయాలలో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, సోషల్ స్టడీస్ పోస్టులకు ఈనెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ తో పాటు బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు పోస్టులకు అర్హులని తెలిపారు. దరఖాస్తులను "మహాత్మ జ్యోతిబాపూలే బిసి బాలికల గురుకుల పాఠశాల ఎంఆర్ఆర్ కాంప్లెక్స్, సహారా గేట్ నెంబర్ 1, రోడ్ నెంబర్ 6, ముసరాంబాగ్, రంగారెడ్డి" జిల్లాలో సమర్పించాలని సూచించారు.



# సంపాదకీయం

## లక్ష్మణరేఖ దాటేస్తున్నారా..?

దేశానికి రాష్ట్రపతి ఎంత కీలకమో రాష్ట్రాలకు గవర్నర్ పదవి అంతే కీలకం. వీళ్లద్దరూ భారత రాజ్యాంగ బద్దంగా ప్రభుత్వాలు నడుస్తున్నాయో లేదో చూడాలి తప్ప రాజకీయ పార్టీల్లా పాలిటిక్స్ చేస్తే పనిచేయదని క్లారిటీ ఇచ్చింది. గవర్నర్ల విచక్షణాధికారానికి కత్తెర వేసింది. రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్న గవర్నర్ల వల్ల అత్యున్నతమైన ఆ ఉన్నత వ్యవస్థకు ఇలాంటి నిబంధనలు విధించాల్సి వచ్చింది. అయితే, ఇకపై ఇలాంటి పరిస్థితిలో మార్పు వస్తుందని అంతా ఆశీస్తున్నారు. గవర్నర్ల నియామకంలో మార్పులు వచ్చినా రాకపోయినా.. ఇప్పుడు, సుప్రీం తీర్పుతో.. గవర్నర్లు దారిలోకి వస్తారనడంలో సందేహం లేదు. ఇక, ఎలాగూ కేంద్రంలో ఉన్న అధికార పార్టీకి కూడా దాదాపు హెచ్చరికలు వెళ్లినట్లే భావించాలి గనుక.. సుప్రీం కోర్టుకు వ్యతిరేకంగా, రాజ్యాంగానికి విరుద్ధంగా నడుచుకునే సాహసం అయితే చేయరనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇండియాలో పాలిటిక్స్ ఎంత పీక్స్‌లో ఉంటాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే, పాలనలో మాత్రం స్వార్థపూరిత రాజకీయాలు ఉండకూడదనే ఉద్దేశంతోనే రాజ్‌భవన్‌కు కూడా రాజ్యాంగం అధికారాలు ఇచ్చింది భారత రాజ్యాంగం. ఒకవేళ, ప్రజా ప్రతినిధులు రాజకీయాలు చేస్తున్నా.. రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాలకు సక్రమమైన సలహాలు ఇవ్వడానికి రాజ్‌భవన్‌లో ఉండే రాష్ట్రపతికి, గవర్నర్లకు విచక్షణాధికారాలు కూడా కట్టబెట్టింది. అయితే, ఇక్కడ కూడా పొలిటికల్ వ్యవహారాలకే పెద్దపీట వేస్తున్న పరిస్థితి. "నా ప్రభుత్వం ఫలానా పని చేసిందని గర్వగా చెబుతున్నాను" అనాల్సిన గవర్నర్లు ఆ ప్రభుత్వాలతోనే ఫైట్ చేస్తున్నారు. వివాదాస్పద బిల్లులైతే ఓకే గానీ.. పాలనా పరమైన కీలక బిల్లుల్ని కూడా పక్కనపెట్టేస్తోంది రాజ్‌భవన్. కొన్ని సందర్భాల్లో పాలనకు కూడా అడ్డొస్తున్నారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లుల్ని రాజ్‌భవన్‌లోనే తొక్కి పెట్టి, కక్ష్యపూరింతంగా వ్యవహరిస్తున్నారు. గవర్నర్‌లను రాజకీయంగా ఉపయోగించుకునే దుస్థితి ఇప్పటిది కాకపోయినప్పటికీ? ఇటీవల కాలంలో ఇది మరింత దిగజారింది. అందుకే, సుప్రీం కోర్టు ఫైనల్ రూల్ ఇచ్చేసింది. ఇకపై బిల్లులను ఇష్టం వచ్చినట్లు ఆపేస్తామంటే కదరదనీ.. గవర్నర్ల విచక్షణాధికారానికి సుప్రీం కోర్టు కత్తెర వేసింది. ప్రజాస్వామ్యాన్ని దాటి గవర్నర్లకైనా? రాష్ట్రపతికైనా సూపర్ అధికారాలు లేవంటూ కుండబద్దలు కొట్టింది. దశాబ్ధంగా దేశంలోని పలు రాష్ట్రాల గవర్నర్ల తీరుపై సుప్రీం కోర్టుకు ఫిర్యాదులు వెళ్తున్నాయి. అసెంబ్లీలో ఆమోదించి, రాజ్‌భవన్‌కు పంపుతున్న బిల్లులను సంవత్సరాల తరబడి ఆపేస్తున్నారంటూ ఆందోళనలు వచ్చాయి. దేశ రాజధాని ఢిల్లీ నుండి కేరళ, తమిళనాడు, తెలంగాణా, పశ్చిమ బెంగాల్, పంజాబ్, జార్ఖండ్ వరకు తమ గవర్నర్లపై ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోపణలు గుప్పించాయి. కొందరైతే ఇంకాస్త ముందుకెళ్లి గవర్నర్‌ను తొలగించమని వినతులు కూడా పెట్టారు. ఆయా రాష్ట్రాలు..'తమ గవర్నర్లు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీల కొమ్ముకాస్తున్నారని' చెబితే? 'గవర్నర్ ఎందులోనైనా కలుగచేసుకుంటారు' అనే స్థాయిలో గవర్నర్లు మాట్లాడారు. అయితే, ఈ పరిస్థితి నాన్ బిజెపి ప్రభుత్వం ఉన్న దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కనిపించింది. కొన్ని రాష్ట్రాల్లో అయితే ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం కంటే కేంద్రం నామినేట్ చేసిన గవర్నర్‌దే రూలింగ్ అనే లెవల్‌కు వెళ్లింది. దేశంలోని మాజీ న్యాయమూర్తులు కూడా ఈ ధోరణిని రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. వామపక్ష పార్టీలైతే? గవర్నర్ పదవిని "అసంబద్ధం"గా పేర్కొంటూ రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశాయి. ఇక, ఈ యుద్ధానికి ఇప్పుడు ముగింపు వచ్చింది. ఇటీవల, తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తీరుపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీమ్ కోర్టుకు వెళ్లగా.. అత్యున్నత న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. ఏప్రిల్ 11న ఈ తీర్పు కాపీని బహిరంగపరిచింది కోర్టు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి వర్సెస్ తమిళనాడు ప్రభుత్వం కేసులో దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ సంచలన తీర్పు ఇచ్చింది. రాష్ట్ర శాసనసభ పంపించిన బిల్లులను ఆమోదించకుండా పక్కన పెట్టే అధికారం గవర్నర్‌కు లేదని తేల్చి చెప్పింది. అలాంటి వీటో అధికారాలు గవర్నర్‌కు ఉండబోవని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఈ మేరకు కీలక తీర్పును వెలువరించింది. తమిళనాడు అసెంబ్లీ తీర్మానించి రాజ్‌భవన్‌కు పంపించిన 10 బిల్లులకు సంబంధించి 2020 నుండీ గవర్నర్ ఆర్ఎన్ రవి ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఉండటం చట్టవిరుద్ధమని ప్రకటించింది. సాధారణంగా రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ తన అంగీకారాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఆ బిల్లులు ఉంటేనే గానీ వాటిని పునఃపరిశీలనకు పంపించే అవకాశం దాదాపుగా ఉండదు. అయితే, తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన అనేక బిల్లులను గవర్నర్ రవి ఆమోదించకుండా ఉద్దేశపూరకంగా అడ్డుకుంటున్నారనేది ప్రభుత్వం వాదన. దీన్ని తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాలు చేయగా? రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్ తన విధులను నిర్వర్తించడానికి స్పష్టంగా కాలపరిమితి లేదని, ఎలాంటి సమయ పరిమితులు లేనప్పటికీ, తనకు అందిన బిల్లులను ఆమోదించకపోవడం, దీనివల్ల రాష్ట్రంలో చట్టాల రూపకల్పన ప్రక్రియను ఆలస్యం చేయడానికి అంగీకరించినట్టయిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యలు తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ.. కోర్టు ఆదేశాలు జారీ చేయడం ఇదే ప్రథమం. 'బిల్లులపై ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఆలస్యం చేయడం ద్వారా రాష్ట్రంలో శాసన నిర్మాణ వ్యవస్థకు గవర్నర్ అవరోధం కలిగించవచ్చన్న అర్థం వచ్చేలా రాజ్యాంగంలోని 200వ అధికరణాన్ని చదువుకోకూడదు' అని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఆర్టికల్ 200ని ఆర్టికల్ 163తో పాటు చదవాలని కోర్టు వెల్లడించింది. దీని ప్రకారం.. క్యాబినెట్ సలహా మేరకు గవర్నర్ చర్య తీసుకోడానికి కట్టుబడి ఉండాలని" పేర్కొంది. నిజానికి, గవర్నర్ స్థాయిలో ఉన్నవారికి కోర్టుల నుండి మొట్టికాయలు పడటం.. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన పదవిలో ఉన్న వ్యక్తిని రాజ్యాంగబద్ధంగా నడుచుకోమని పదేపదే చెప్పాల్సిరావడం ఆ పదవికి, మొత్తంగా రాజ్‌భవన్‌కే అవమానంగా మారుతున్న పరిస్థితి. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలకు, రాష్ట్రాల అధికారాలకు తాము అతీతులమన్న తరహాలో వ్యవహరిస్తున్న గవర్నర్లకు ఈ తీర్పు స్పష్టమైన హెచ్చరికే అనుకోవాలి. కాలపరిమితులను దాటితే గవర్నర్ల నిర్ణయాలు కూడా న్యాయసమీక్ష ముందు నిలవాల్సివస్తుందన్న సూచన చాలా మార్పులను తీసుకొస్తుందనడంలో సందేహం లేదు. ఇది, ఇకపై రాష్ట్ర ప్రభుత్వాలకు, గవర్నర్లకు మధ్య సఖ్యతను కుదురుస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



**శేరిలింగంపల్లి, జూలై 10, (తెలంగాణ దిశ) :**గురు పౌర్ణమి సందర్భంగా ఆల్విన్ కాలనీ డివిజన్ లో ప్రవేట్ పాఠశాల ప్రాంగణంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రావు ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు అధ్యక్షతన ఈ వేడుకలను నిర్వహించారు. హాఫీజ్ పేట్ డివిజన్ హుడా కాలనీ లోని లక్ష్మీ గణపతి ఆలయం వద్ద కాంటెస్ట్ కార్పొరేటర్ అనూష మహేష్ యాదవ్, బీజేపీ మహిళా మోర్చా పార్లమెంట్ కో కన్వీనర్ పద్మ ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, ఆషాఢ మాస గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గురువులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో అన్ని నేర్పించే గురువులుగా తల్లిదండ్రులు, తర్వాత చదువు, విజ్ఞానాన్ని అందించే ఉపాధ్యాయులు ఇలా వారు మాత్రమే కాకుండా జీవితంలో మంచిగా ఉండడం, సన్మార్గంలో నడవడం, ఉన్నత శిఖరాలకు అధిరోహించడంలో మనకు ఎల్లప్పుడూ సరైన సూచనలు, సలహాలు ఇచ్చే ప్రతి ఒక్కరు గురువుతో సమానమేనని అన్నారు. ఇలాంటి వారినందరినీ గురుపూజోత్సవం సందర్భంగా సన్మానించుకోవడం మన కర్తవ్యమని అన్నారు.

# ఆలయంలో విగ్రహాలను ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ర్యాలీ ధర్నా



**కుత్బుల్లాపూర్, జూలై 10, (తెలంగాణ దిశ) :**సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గాజులరామారం125 డివిజన్ కైసర్ నగర్ లో శివాలయం, మార్కండేయ ఆలయంలో విగ్రహాలు ధ్వంసం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ర్యాలీ, ధర్నా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయంలోని నంది, వినాయక విగ్రహాలను ధ్వంసం చేసి, నందిపైన ఉన్న వస్త్రాన్ని కాల్చి కాల్చి వేయడంతో పాటు హుండీలో అగ్గి పుల్లలను వేసి ఆలయంలో గుడి గంటలను విరగొట్టిన దుండగులను శిక్షించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. వరుసగా హిందూ దేవాలయాలపైన జరుగుతున్న ఘటనలను తీవ్రంగా ఖండించారు. ఈ దుశ్చర్యకు పాల్పడ్డ వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. హిందువుల మనోభావాలు, హిందూ దేవాలయాలను కాపాడడానికి హిందు వాహిని ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ దుశ్చర్య పై వ్యతిరేకంగా కైసర్ నగర్ హనుమాన్ ఆలయం నుండి శివాలయం వరకు హిందు వాహిని ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆలయ కమిటీ, హిందూ వాహిని సభ్యులు, బీజేపీ నాయకులు, మహిళలు, వివిధ హిందూ సంఘాలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. సూరారం పోలీసులు పోలీసులు అతి త్వరలో నిందితులను పట్టుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ ర్యాలీలో ఆలయ కమిటీ రాంజీ, హరి, హిందూ వాహిని శ్యామ్, ప్రతాప్, శేషు, వినోద్, జగదీశ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్, గరిగే శేఖర్, చందు, బాలకృష్ణ, లీగల్ సెల్ శివానంద్, బీజేవైఎం శ్యామ్ కిరణ్ రెడ్డి, శ్రీధర్, ఓబీసీ మోర్చా లక్ష్మణ్, పులి రాజు, మహిళ మోర్చా రేవతి సింగ్, రాజు యాదవ్, కె. కుమార్, వీరచారీ, ప్రశాంత్, బలరాం, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిరు పేదలకు వరం

### - బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్



**చర్లపల్లి, జూలై 10, (తెలంగాణ దిశ) :**ముఖ్యమంత్రి సహాయనిధి పథకంనిరుపేదలకు వరం లాంటిదని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ అన్నారు. గురువారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం మధురానగర్ కు చెందిన టి. సుజాతకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కును అందజేశారు. వైద్యం ఖర్చులు భరించలేని వారికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య మంత్రి సహాయ నిధి పథకం ద్వారా చెక్కులను మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ అధ్యక్షులు జూపల్లి శ్రీశైలం, మధుర నగర్ కాలనీ ఉపాధ్యక్షురాలు వైస్ ప్రెసిడెంట్ అనిలా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సాయి నగర్ శ్రీ సాయిబాబా ఆలయ 25 వ వార్షికోత్సవ వేడుకలు

### గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు





**కుషాయిగూడ, జూలై 10, (తెలంగాణ దిశ) :**కుషాయిగూడ సాయి నగర్ కాలనీలోని సాయిబాబా దేవాలయం 25 వ వార్షికోత్సవం, గురు పౌర్ణమి వేడుకలలో దేవాలయ కమిటీ, సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. సామూహిక క్షీరాభిషేకం, సాయి వ్రతం, పల్లకి ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన భక్తి గీతాలాపన సభికులను ఎంతగానో ఆకట్టుకుంది. మహిళలు పెద్ద సంఖ్యలో వేడుకలలో పాల్గొన్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు ఎం. గోపాల కృష్ణమరాజు, కార్యదర్శి రమేష్ రెడ్డి, కోశాధికారి యాదగిరి, సాయి నగర్ కాలనీ అధ్యక్షుడు సారా వినోద్ కుమార్, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, సభ్యులు యవాపురం విశ్వనాథం, చాడ నరసింహారెడ్డి, హరినాథ్ రెడ్డి, అమర్నాథ్, రవి ప్రసాద్, ఆంజనేయులు, రామచంద్ర షా, అనిల్, ప్రతాపరెడ్డి, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



# జూలై 13న మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు

### - మహాత్మా గాంధీ చరఖా అవార్డుల ప్రధానోత్సవం



**భువనగిరి, జూలై 10, (తెలంగాణ దిశ) :**గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, వినోబా నగర్ డెవలప్ మెంట్ సొసైటీ, తెలంగాణ స్వర్ణోదయ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 50వ స్వర్ణోత్సవాల ఉత్సవాల సందర్భంగా జూలై 13న మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు, "మహాత్మా చరఖా అవార్డుల ప్రధానోత్సవ" కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మెరుగు మధు తెలిపారు. గాంధీ సంస్థ చైర్మన్ డాక్టర్ గున్నా రాజేందర్ రెడ్డి అధ్యక్షతన నాంపల్లి గాంధీభవన్ లోని ప్రకాశం హాల్ లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం జరుగుతుం దని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గోపూజ, 1500 మహాత్మాగాంధీ (ఒక ఫీట్ ఎత్తు) విగ్రహాల సామూహిక ప్రదర్శన, 156 చరఖాల ప్రదర్శన, 156 మందితో బాల గాంధీల వేషధారణ, గాంధీజీ, ఆచార్య వినోబా భావే ఫోటో గ్యాలరీ, పుస్తక ప్రదర్శన, ఎద్దు గానుగ ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా ఇంకుడు గుంత ప్రారంభోత్సవం, గాంధీ సుస్థిర విజ్ఞాన (విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణ పరిశ్రమలు, సహజ ఇంధన వనరులు, పర్యావరణం, మత్తు పదార్థాల నిషేధం) తదితర అంశాలపై ప్రదర్శనలు, ప్రముఖుల సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితోపాటు మల్కంబ్, యోగ ప్రదర్శన, ప్రతిభ పాటవ పోటీలలో విజేతలకు బహుమతి ప్రధానం ఉత్సవం, గాంధీయ వాదులకు "మహాత్మా చరఖా అవార్డు"లతో సన్మానోత్సవ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గాంధీ జ్ఞాన్ ప్రతిష్టన్ స్వర్ణోత్సవాలు, భూదాన్ వజ్రోత్సవాల క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

ఈ సదస్సు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలు, గాంధీయ వాదులు, పర్యావరణ వేత్తలు, యువతి, యువకులు, విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సదస్సుకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే కుంభంకు ఆహ్వానం మహాత్మా గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సు హాజరు కావాలని కోరుతూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డికి గురువారం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాలకూర్ల వెంకటేశం గౌడ్, కాసుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు క్యాబినెట్ ఆమోదం పట్ల హర్షణీయం

### - మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి



**కుత్బుల్లాపూర్, జూలై 10, (తెలంగాణ దిశ) :**రాష్ట్రంలో సగం జనాభాకు మించి ఉన్న బీసీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్య క్షురాలు రాజనోళ్ల లక్ష్మిహర్షం ప్రకటించారు. మార్చి నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను ప్రభుత్వం ఆమోదించిందని ఆమె తెలిపారు. విద్యా, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ ప్రాతినిధ్యం కల్పించే రెండు బిల్లులను ఆమోదించినట్లు ఆమె గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బీసీ డెడికేటేడ్ కమిషన్ ను నియమించిందన్నారు. రాష్ట్ర ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో కుల గణన చేపట్టిందన్నారు. వీటి ఆధారంగానే క్యాబినెట్ లో 42శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిందన్నారు. బీసీల సామాజిక న్యాయానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లకు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో ఎంతో మంది బీసీ మహిళలు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయమని ఆమె అభివర్ణించారు.

### సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన

# రూ. ఆరు లక్షల విలువ గల ఎల్ఓసిల పంపిణీ



**శేరిలింగంపల్లి, జూలై 10, (తెలంగాణ దిశ) :**
ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 6 లక్షల ఎల్ఓసిని గురువారం పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ లబ్ధిదారులకు అందజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలకు చెందిన పలువురు అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆరు లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన ఎల్ఓసి మంజూరీ పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రగుండ్ల శ్రీనివాస్ యాదవ్, పురందర్ రెడ్డి, నాని తదితరులు పాల్గొన్నారు.

### న్యాయవాది సుంకర నరేష్ పై బార్ కౌన్సిల్ జారీ చేసిన ఉత్తర్వులపై

# స్టే ఇచ్చిన హైకోర్టు




**హైదరాబాద్, జూలై 10, (తెలంగాణ దిశ):** హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ ను బార్ కౌన్సిల్ నుంచి తొలగించడంపై హైకోర్టు బుధవారం స్టే జారీ చేసింది. తెలంగాణ బార్ కౌన్సిల్ ఈ నెల ఒకటవ తేదీన తొమ్మిది మంది న్యాయవాదుల ఫొటోలతో ఫేక్ సర్టిఫికెట్స్ కారణంగా బార్ కౌన్సిల్ సభ్యత్వాన్ని తొలగిస్తున్నట్లు ప్రకటించిన విషయం విధితమే. ఈ విషయంపై న్యాయవాది సుంకర నరేష్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ కౌన్సిల్ బాలయ్య తరుపున సీనియర్ న్యాయవాది మయూర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ బార్ కౌన్సిల్ చర్య కుట్ర పూరితంగా, ఎటువంటి సహజ న్యాయ సూత్రాలు పాటించకుండా, ముందస్తు ప్రణాళికలో భాగంగా నరేష్ పేరును మిగిలిన న్యాయవాదులతో చేర్చడం ముమ్మాటికి పిటిషనర్ యొక్క ప్రతిష్టను దిగజార్చడానికి చేసిన చర్య అని తెలిపారు. బార్ కౌన్సిల్ తరుపు న్యాయవాదికి మూడు రోజులు సమయం ఇచ్చి సమాధానం తెలపాలన్న న్యాయస్థానం సదరు న్యాయవాది వాదనలు విన్న తరువాత, పిటిషన కౌన్సిల్ వాదనలతో ఏకీభవించి బుధవారం సుంకర నరేష్ ను బార్ కౌన్సిల్ నుండి తొలగిస్తూ జారీచేసిన ఉత్తర్వులపై స్టే ఇచ్చింది.

## రేషన్ కార్డ్ స్టేటస్ ఇలా చెక్ చేసుకోండి

**నల్గొండ,తెలంగాణ దిశ:** తెలంగాణలో కొత్త రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే అర్హత గల వారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. తొలుత గ్రామ సభల్లోనూ, ఆ తర్వాత మీ సేవా కేంద్రాల ద్వారా తెలుపు రంగు రేషన్ కార్డు కోసం లక్షలాది మంది ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. కానీ దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా దాని స్టేటస్ మాత్రం తెలియక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తమకు తెలుపు రంగు కార్డు ఈ ప్రభుత్వంలోనైనా వస్తుందా? రాదా? అన్న అనుమానంతో ప్రజలు ఉన్నారు. సంక్షేమ పథకాలు దక్కాలంటే తెలుపు రంగు రేషన్ కార్డు అవసరం కావడంతో వీటికి తెలంగాణ వ్యాప్తంగా అత్యధిక డిమాండ్ ఏర్పడింది. గత పదేళ్ల నుంచి కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో లబ్దిదారుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. అందిన సమాచారం మేరకు ఆరు లక్షల మందికి పైగానే తెలుపు రంగు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. తెలుపు రంగు రేషన్ కార్డు వస్తే విద్య, వైద్యం విషయాల్లో నిర్భయంగా ఉండటమే కాకుండా ఉచిత విద్యుత్తు పాటు ఐదు వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్ కూడా లభిస్తుందని ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుని రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. తమ రేషన్ కార్డుల పరిస్థితిని తెలుసుకు నేందుకు ప్రజలు తిరిగి మీ సేవా కేంద్రాల వద్ద క్యూకడుతున్నారు. కానీ వారి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు అయితే రేషన్ కార్డు స్టేటస్ ను తెలుసుకోవడానికి ప్రభుత్వం సులువైన పద్ధతిని ప్రవేశపెట్టింది. ఇంట్లో ఉండే రేషన్ కార్డు స్టేటస్ ను తెలుసుకునే వీలుంది. ఫోన్ ద్వారానే స్టేటస్ ను తెలుసుకునే వీలుంది. ఫోన్ లో తెలంగాణ ఫుడ్ సెక్యూరిటీ అధికారిక వెబ్ సైట్ ను ఓపెన్ చేయాల్సి ఉంటుంది.

# శ్రామిక శక్తిని కుదించిన మోడీ





బహుళ ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడుతున్నప్పటికీ, 2021లో మొదటిసారిగా భారతదేశ తలసరి జిడిపి బంగ్లాదేశ్ కంటే కూడా వెనుకే ఉంది. దీనికి మొత్తం లాక్‌డౌన్ ను కారణంగా చెప్పవచ్చా? లేక పెద్ద నోట్ల రద్దు లాంటి చర్యలు 2016 లోనే ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని స్థితిలోకి నెట్టాయా? ప్రముఖ కాలమిస్ట్, 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' భారత అధ్యక్షుడు ఆకార్ పటేల్... ఫ్రంట్‌లైన్ ప్రతినిధి జియా ఉస్సలామ్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలోని కొన్ని ముఖ్యాంశాలు... ఇక్కడ జాతీయ లాక్‌డౌన్ ను కారణంగా చెప్పలేం. 2014లో బంగ్లాదేశ్ తలసరి జిడిపి భారతదేశం కంటే 50 శాతం వెనుకబడి ఉంది. మోడీ పాలనా కాలంలో బంగ్లాదేశ్ భారత్ ను చేరుకోగా, భారత దేశం ఆర్థికంగా తన మార్గాన్ని కోల్పోయింది. బంగ్లాదేశ్ సరుకులు ఎగుమతిలో, వస్త్రాల తయారీలో లక్షలాది మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రపంచ ఛాంపియన్‌గా ఉంది. వస్త్ర ఉత్పత్తిపై ఆ ప్రభుత్వం బాగా కేంద్రీకరించింది.మరోవైపు, మోడీ దేశ ప్రధాని కావడానికి ముందు నుంచే ఐదు కోట్ల మంది భారతీయులు పని చేస్తున్నారు. అమెరికాలో శ్రామిక శక్తి భాగస్వామ్యం 60 శాతం, చైనాలో 70 శాతంగా ఉంటే, నేడు భారత దేశంలో కేవలం 40 శాతం మాత్రమే ఉంది. ఇది పాకిస్థాన్ శ్రామిక శక్తి కంటే తక్కువ. మొదటిసారిగా దక్షిణాసియాలోనే ఇది అత్యంత తక్కువ శ్రామిక శక్తిగా నమోదైంది. మోడీ, భారతదేశ శ్రామిక శక్తిని ఐదవ వంతుకు తగ్గించాడు. ఇవి ప్రభుత్వం ఇచ్చిన లెక్కలే కాబట్టి వీటిలో ఎటువంటి వివాదానికి తావుండదు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ప్రస్తుతం పని చేస్తున్న వారికి నాలుగింతల మంది 2013లో ఉండేవారు. కాబట్టి భారతీయులకు పని కావాలి కానీ పని లేదు. ఫలితంగా అపారమైన నష్టం జరుగుతుంది. 2012లో కంటే 2018లో భారతీయులు తక్కువ ఖర్చు చేస్తూ, తక్కువ తింటున్నారు. ఒక ప్రభుత్వ సర్వే ప్రకారం, పదవీ విరమణ చేయబోతున్న ప్రధాన ఆర్థిక సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్ ఆ సర్వే విడుదల చేయాలని కోరారు కానీ భయంతో మన ప్రధాని దానిని దాచి ఉంచారు. దశాబ్దాల ప్రగతిని తారుమారు చేస్తూ, 2020లో 23 కోట్ల మంది ప్రజలు పేదలుగా మారారు. 800 మిలియన్ల మంది నేడు ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న పప్పులు, ధాన్యాలపై ఆధారపడుతున్నారు.

ఆఖరికి మోడీని ఆరాధించే మధ్య తరగతి ప్రజల అభివృద్ధి కూడా ఆగిపోయింది. పది సంవత్సరాలుగా, ప్రతీ సంవత్సరం అమ్మకానికి పెట్టిన కార్లు, గృహ ఆస్తుల సంఖ్య పూర్తిగా తగ్గిపోతుంది. దిగువ మధ్య తరగతి ప్రజల అభివృద్ధి కూడా నిలిచిపోయింది. ఐదు సంవత్సరాల కాలంగా ద్విచక్ర వాహనాల అమ్మకాల సంఖ్య, 15 సంవత్సరాలగా త్రిచక్ర వాహనాల అమ్మకాల సంఖ్య పూర్తిగా పడిపోయింది. మనం తిరోగమన దిశలో ఉంటున్నాం. ఒకవేళ మనం అంతా బాగానే ఉందనుకుంటే, సరిచేయడానికి ఏమీ ఉండదు. ప్రధానమంత్రికి వాస్తవాలు తెలుసో లేదో గానీ, అంతా బాగుందంటున్నారు. కానీ అది వాస్తవం కాదు. ఏ దేశం తన కరెన్సీని రద్దు చేయడం ద్వారా అవినీతిని అరికట్టలేదు. ఆర్బీఐ కూడా పెద్ద నోట్ల రద్దు గురించి మోడీని హెచ్చరించింది. అయినా ఆయన ఎందుకు తన నిర్ణయాన్ని అమలు చేశారు? స్వయంకృతాపరాధం వల్ల కలిగిన నష్టం నుండి మనం కోలుకున్నామా? మోడీ చాలా నిష్కర్షగా ఉంటానని చెపుతారు, కానీ ఆయనకు వివరాలు తెలియదు. ఆయన తన దగ్గరకొచ్చిన ఫైళ్ళను చదవరు. మౌఖికంగా చెప్పిన విషయాలను రెండు నిమిషాల్లో విని, చర్యలకు నిర్ణయం తీసుకుంటామని చెపుతారు. దేశాన్ని పాలించే విధానం ఇది కాదు. కానీ ఇదే ఆయన పద్ధతి. ఇది ఆయనకు సౌకర్యంగా ఉందని అంటారు. ఆయనొక శక్తివంతమైన నాయకుడు. ఆయన తప్పు చేస్తున్నారని చెప్పేవారెవరూ లేరు. అవినీతిని, నల్ల ధనాన్ని, తీవ్రవాదాన్ని అంతమొందించడానికి పెద్ద నోట్ల రద్దే చాలా తేలికైన పరిష్కారమని ఆయన నమ్మారు. ఆయన ఆ నిర్ణయాన్ని అమలు చేయడానికి ముందు దాని వల్ల కలిగే దుష్ఫలితాలను పరిగణ లోకి తీసుకోకపోవడం వలన కల్లోల పరిస్థితులు, దురవస్థలు ఏర్పడి, ఆ నిర్ణయం వైఫల్యం చెందినపుడు భంగపడ్డారు. నవంబర్ 8 సమావేశానికి మంత్రులందరూ ఫోన్లు లేకుండా హాజరవ్వాలని చెప్పడమంటే దానర్థం, మంత్రులెవ్వరికీ ఏం జరుగుతుందనే విషయం తెలియదు. నోట్ల రద్దు గురించి కూడా తెలియదు. అంటే ముందస్తు ఏర్పాట్లు లేవు. మనం కోలుకున్నామా లేదా కోలుకుంటామా చెప్పడం కష్టం. స్థూల దేశీయ ఉత్పత్తిలో వస్తు ఉత్పాదక భాగం, "మేకిన్ ఇండియా" ప్రారంభించిన తరువాత 16 శాతం నుంచి నేడు 13 కంటే తక్కువ శాతానికి పడిపోయింది. 2016 తరువాత వస్తు ఉత్పాదక రంగంలో మొత్తం ఉద్యోగాలు 5.1 కోట్ల నుండి సగానికి అంటే 2.7 కోట్లకు పడిపోయాయి. ప్రధానమంత్రి పూర్వ సలహాదారు అరవింద్ పనగారియా, ఆత్మ నిర్భర్ భారత్ గందర గోళంగా ఉందని అన్నారు. భారతీయ వినియోగదారునికి వస్తువు లను ఎక్కువ ఖరీదుకు అందజేసి, బయటి పోటీ నుంచి ధనిక వ్యాపారస్తులను కాపాడటం దాని ప్రాథమిక కర్తవ్యంగా ఉంది. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం ఎప్పుడూ తక్కువగానే ఉంటుంది."మేకిన్ ఇండియా", యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన నేషనల్‌మాన్యుఫాక్చరింగ్ పాలసీకి అనుకరణ. ఆఖరికి లక్ష్యాలు కూడా ఒకే విధంగా ఉన్నాయి. అదనంగా లోగోను చేర్చారంతే. అది మోడీ పని తీరును తెలియజేస్తుంది. ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందనే విషయాన్ని బయటకు చెప్పకుండా గుర్తించే సామర్థ్యం ప్రభుత్వానికి ఉంది. మోడీకి ఉద్యోగాలను సృష్టించగలనన్న విశ్వాసం ఉండేది. అందువల్ల ఆయన ప్రారంభంలో ఆ పథకానికి నిధులను కుదించి, దానిని ఎగతాళి చేశారు.ఆర్థిక వ్యవస్థ కూలిపోవడం మొదలైనప్పుడు, 2014లో ఆ పథకానికి చేసిన ఖర్చు 32 వేల కోట్ల నుండి 2018లో 61 వేల కోట్లకు రెట్టింపై, 2020 లో మూడింతలు అంటే 1,11,000 కోట్లకు పెరిగింది. ఈ సంవత్సరం కేటాయిం చిన నిధులు మొదటి ఏడు నెలల్లోనే ఖర్చయ్యాయి. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన (పీఎంఏవై), వాస్తవానికి ప్రభుత్వం ఎటువంటి నిర్మాణాలు చెయ్యదు. అది నాలుగు భిన్నమైన భాగాల కింద నిధులు ఇస్తుంది. వాటిలో ప్రధానమైనది, ఇళ్ళను నిర్మించుకునే వారికి లేక ఇళ్ళను విస్తరణ చేపట్టిన వారికి ప్రత్యక్షంగా సహాయం చేస్తుంది. దీనికి భూమిపై యాజమాన్య రుజువు ధ్రువీకరణ అవసరం. ఇతర అన్ని పథకాల వలె పీఎంఏవై కూడా పూర్వం ఉన్న పథకానికి పేరు మార్చుతుంది. ఇతర పథకాల వలె ఈ పథకం కూడా భారత దేశంలో పాలనాపరమైన ఇబ్బందుల లాంటి వాటినే ఎదుర్కొంటుంది. మంజూరు చేసిన దానికంటే కేంద్రం చెల్లించేది చాలా తక్కువగా ఉంటుంది. పీఎంఏవై మొదటి నాలుగేళ్లలో రూ. 2 లక్ష కోట్లు మంజూరు చేసి, కేవలం రూ. 20 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఒకటి, ఆర్థికంగా భారతదేశం చైనా తరువాత దేశంగా ఉండే మార్గంలో లేదు. మోడీ పాలనలో, ఆర్థిక వ్యవస్థ భారీగా పేదరికాన్ని కొనసాగించే, పెద్ద సంఖ్యలో నిరుద్యోగులను సృష్టించే మార్గంలో ఉంది. ఇప్పుడున్న విధంగా, కొద్దిమందే మెజారిటీ వనరులు, సంపదను అదుపు చేస్తారు.రెండోది, సమాజానికి సంబంధించినది. మనం విభజించబడతాం. మైనారిటీలు బలవంతంగా ప్రత్యేక ప్రాంతాల్లో ఉంటారు. ప్రజల మనసులు మతపరమైన విభేదాలతో, వారి చిహ్నాలతో ఆవహించి ఉంటూ,హింసను కూడా అంగీకరిస్తారు. న్యాయ వ్యవస్థ భయంతో తన బాధ్యతను విస్మరిస్తుంటే,మోడీ హిందూత్వ శక్తులు చట్టబద్ధమైన అధికార బదిలీ కోసం ప్రోత్సహిస్తున్నాయి. నేడు హిందూత్వ అల్లరి మూకలు భారతదేశాన్నేలుతూ, భవిష్యత్తులో తామనుకున్నది జరగాలని కోరుకుంటున్నాయి.

# సరిహద్దుల్లో డ్రాగన్ కుట్ర....



గత ఏడాది గాల్వాన్ లోయ వద్ద భారత సైనికులపై దొంగదెబ్బ తీయబోయి భంగపడినప్పటి నుండి సరిహద్దుల్లో చైనా దూకుడుగా వ్యవహరిస్తున్నది. రెండు దేశాల సైనికాధికారుల మధ్య పలు పర్యాయాలు చర్చలు జరిగినా వారి ధోరణిలో మార్పు రావడం లేదు. ద్వైపాక్షిక ఒప్పందాలను ఉల్లంఘిస్తూ సరిహద్దుల్లో నిర్మాణాలు, సేనల మోహరింపు కొనసాగిస్తున్నది. దానితో ఇప్పటి వరకు పశ్చిమాన పాకిస్థాన్ సరిహద్దుకు పరిమితమైన ఉద్రిక్తలు ఇప్పుడు చైనా సరిహద్దుకు విస్తరించాయి. చైనా ధోరణుల పట్ల దిగవంత చీఫ్ అఫ్ డిఫెన్సె స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్ పలు సందర్భాలలో కఠినంగా మాట్లాడారు. చైనా నుండి ఎటువంటి దాడులు ఎదురైనా ఎదుర్కొనేందుకు మన సేనలు సిద్ధపడుతూనే ఉన్నాయి. సరిహద్దుల్లో రహదారులు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, అత్యాధునిక ఆయుధాలను మోహరించడం వంటివి చేస్తున్నాము. అయితే దౌత్యపరంగా చైనా దూకుడుకు కళ్లెం వేసే ప్రయత్నం తగు స్థాయిలో జరగడం లేదనిపిస్తుంది. తాజాగా అరుణాచల్‌ప్రదేశ్‌లోని 15 ప్రదేశాలకు చైనా తమ పేర్లు పెట్టి, నోటిఫై చేసింది. అవ్వన్నీ తమ ప్రాంతాలనే పాత పాట పడింది. దీనిపై ఎప్పటివలే విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఖండన ఇవ్వడం మినహా రాజకీయంగా స్పంద న కనిపించడం లేదు. దేశంలో ప్రధాన రాజకీయ పక్షాలు కూడా ముభావంగా కనిపిస్తున్నాయి. అంతకు ముందు రెండు పర్యాయాలు, అరుణాచల్ ప్రదేశ్ భూభాగంలో చైనా గ్రామాలు నిర్మిస్తున్నట్లు అంతర్జాతీయ నిఘా సంస్థలు ఉపగ్రహ చిత్రాలను విడుదల చేశాయి. వాటి పట్ల భారత ప్రభుత్వ స్పందన చాలా నిరాశ కలిగిచింది. అవి చైనా స్వాధీనంలో ఉన్న భూభాగంలోనివే అంటూ తమకేమి పట్టన్నట్లు వ్యవహరించింది. చైనా ఆక్రమించిన భారత్ భూభాగమా లేదా చైనా సొంత భూభాగమా అన్న వివరణ లేదు. పాక్ ఆక్రమిత కశ్మీర్ భూభాగం పాకిస్థాన్ స్వాధీనంలో ఉన్నప్పటికీ అక్కడ ఆ దేశ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకున్నా రాజకీయ పరంగా కావచ్చు లేదా సైనికంగా కావచ్చు మనం నిరసనలు తెలుపుతూ ఉంటాము. ఎందుకనే ఆ భూభాగాన్ని భారత్‌లో అంతర్భాగంగా మనం స్పష్టం చేస్తున్నాము. చైనా విషయంలో అటువంటి స్పష్టత లోపించిందా? ఈ మధ్యనే కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌తో సహా పార్లమెంటేరియన్ల బృందం టిబెట్ ప్రవాస పార్లమెంటులో ఏర్పాటు చేసిన విందుకు హాజరవడంపై వారం తర్వాత, ఢిల్లీలోని చైనా రాయబార కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ఆ విధంగా టిబెట్ స్వాతంత్ర్యం కోరే వారికి మద్దతు అందించడం మానుకోవాలని అంటూ వారికి హితవు చెప్పింది. అఖిలపక్ష భారతీయ పార్లమెంటరీ ఫోరమ్ ఫర్ టిబెట్ ఆధ్వర్యంలో డిసెంబరు 22న ఢిల్లీలోని ఒక హొటల్‌లో జరిగిన ఒక కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా కనీసం ఆరుగురు ఎంపిలు హాజరయ్యారు. వీరిలో కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, మేనకా గాంధీ, కెసి రామమూర్తి (కాంగ్రెస్), జైరామ్ రమేష్, మనీష్ తివారీ (కాంగ్రెస్), బిజెడి సుజీత్ కుమార్ (బిజెడి) ఉన్నారు. ఆ విధంగా మన ఎంపిలకు నేరుగా చైనా రాయబార కార్యాలయం లేఖలు రాయడంపై కూడా ప్రభుత్వం నుండి చెప్పుకోదగిన స్థాయిలో నిరసనలు వ్యక్తం కాలేదు. కేవలం బిజెడి ఎంపి సుజిత్ కుమార్ మాత్రమే ఘాటుగా స్పందించారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత పార్లమెంటు సభ్యునికి రాయడానికి చైనా రాయబార కార్యాలయంలో రాజకీయ సలహాదారు ఎవరు? భారత ఎంపిలకు లేఖలు పంపడానికి మీకు ఎంత ధైర్యం? ఏదైనా ఉంటే, మీరు అధికారిక మార్గాల ద్వారా మీ నిరసనను తెలియజేయవచ్చు అంటూ హెచ్చరిక ధోరణిలో మాట్లాడారు. ద్వైపాక్షిక సంబంధాలను ఉటంకిస్తూ భారతదేశంలో టిబెటన్లు నిర్వహించే కార్యక్రమాలకు హాజరుకావద్దని భారత ప్రభుత్వం సీనియర్ నాయకులును నాలుగేళ్ల క్రితం కోరడం గమనార్హం. అంటే టిబెట్ అంశంపై ఎంపిలకు సహితం స్వతంత్రంగా వ్యవహరించే స్వేచ్ఛ లేదా? ఈ సంవత్సరం టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా తన 80వ జన్మదినోత్సవం జరుపుకున్నారు. ఇదివరలో ఆయన జన్మదినం రోజున స్వయంగా ప్రధాని ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

కానీ ఈ ఏడాది ట్వీట్ రూపంలో కూడా శుభాకాంక్షలు తెలపలేదు. ఆయనే విదేశాంగ మంత్రిగాని, ప్రభుత్వం తరపున మరెవ్వరు గాని శుభాకాంక్షలు తెలపలేదు. ఈ పరిణామాలు చూస్తుంటే చైనా పట్ల భారత్ నిర్భయంగా వ్యవహరించడంలేదని భావింప వలసి వస్తున్నది. వాస్తవానికి చైనా ప్రభుత్వంతో ప్రధాని నరేంద్ర మోడీకి ఉన్నంత సాన్నిహిత్యం గత ప్రధానులలో ఎవ్వరికీ లేదు. ఆయన మొత్తం మీద 28 సార్లు వ్యక్తిగతంగా కలిసిన్నట్లు చెబుతున్నారు. ప్రధాని కాక ముందు కూడా గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన పలు పర్యాయాలు చైనా సందర్శించారు. గుజరాత్‌కు చెందిన పలు వాణిజ్య ప్రతినిధి వర్గాలను తీసుకెళ్లారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గుజరాత్‌లో పలు చైనా పెట్టుబడులు కూడా వచ్చాయి. అంతటి సాన్నిహిత్యం ఉన్నప్పటికీ చైనా విషయంలో ప్రధాని కఠిన వైఖరి అవలంబించకలేకపోవడం పలువురికి విస్మయం కలిగిస్తుంది. స్వదేశంలోని ప్రతిపక్ష నేతలపై ఇక్కడనే కాకుం డా విదేశాలలో కూడా యథేచ్ఛగా విమర్శలు, ఆరోపణలు కురిపించే ఆయన భారత్ పట్ల ద్వైపాక్షిగా ఒప్పందాలను ఉల్లంగిస్తున్న చైనా పట్ల ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదు. తమ దేశంలో ఆర్థికంగా, ఇతరత్రా సంక్షోభకర పరిస్థితులు ఎదుర్కొంటున్న సమయంలో తమ ప్రజల దృష్టి మళ్లించడం కోసమో లేదా ఇతరత్రా దూరదృష్టి ఎత్తుగడలతో భాగంగా పొరుగు దేశాలపై దురాక్రమణలు దిగడం చైనాకు పరిపాటి. గాల్వాన్ లోయలో ఘర్షణలను కూడా ఆ దృష్టితోనే చూడవలసి ఉంది. ఇప్పుడు చైనా తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నది. చైనాలో ప్రపంచ జనాభాలో 20 శాతం ఉండగా, ప్రపంచంలోని మంచి నీటిలో 7 శాతం మాత్రమే అక్కడ ఉంది. నీటి కొరత కారణంగా దేశం ఏటా 100 బిలియన్ల డాలర్లకు పైగా నష్టపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కొరత, నిలకడలేని వ్యవసాయం పెద్ద మొత్తంలో భూమిని ఎడారిగా మారుస్తున్నాయి. దేశవ్యాప్తంగా నీటి సంబంధిత విద్యుత్ కొరత సర్వసాధారణమై పోయింది. కొన్ని అంచనాల ప్రకారం, చైనా భూగర్భజలాల్లో 80 నుండి 90 శాతం, దాని నది నీటిలో సగం తాగడానికి చాలా మురికిగా ఉన్నాయి. దాని భూగర్భజలాల్లో సగానికి పైగా, నది నీటిలో నాలుగింట ఒక వంతు పరిశ్రమలు లేదా వ్యవసాయానికి కూడా ఉపయోగపడవు. హిమాలయ పర్వతశ్రేణులలో పెరుగుతున్న చైనా దూకుడుకు మూలం నీటి సంక్షోభంగా తెలుస్తున్నది. కీలకమైన జలాలు భారతదేశానికి చేరుకోకముందే అడ్డువేసి, తమవైపు మళ్లించడం కోసం చైనా ప్రయత్నాలు చేస్తున్నది. భారతీయ వ్యూహాత్మక విశ్లేషకుడు బ్రహ్మ చెల్లానీ చెప్పినట్లుగా, దక్షిణ చైనా సముద్రం, హిమాలయాలలో చైనా ప్రాదేశిక విస్తరణ, అంతర్జాతీయ నదీ పరీవాహక ప్రాంతాలలో నీటి వనరులను సొంతం చేసుకోవడానికి చేస్తున్న రహస్య ప్రయత్నాలతో కూడి ఉంది.గాల్వాన్ లోయలో ఘర్షణల తర్వాత చైనా ఉత్పత్తులను బహిష్కరించాలనే పట్టుదల దేశ ప్రజలలో పెరిగాయి. దీపావళి, ఇతర పండుగల సమయంలో చైనా నుండి దిగుమతులను గణనీయ సంఖ్యలో మన వ్యాపార వర్గాలు తగ్గించాయి. కానీ గత రెండేళ్లలో చైనా దిగుమతులను తగ్గించడంలో ప్రభుత్వ పాత్ర ఆశించిన మేరకు లేదు. మొత్తం మీద చైనా నుండి దిగుమతులు పెరుగుతున్నాయి. యుపిఎ ప్రభుత్వంలోనే చైనా దిగుమతులపై ఆధార పడటం దేశ భద్రతకు ప్రమాదకరం కాగలదని ఒక నిపుణుల కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. నరేంద్ర మోడీ ప్రధాన మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన కొత్తలోనే జాతీయ భద్రతా సలహాదారుడు అజిత్ దోవల్ ఔషధ, టెలి కమ్యూనికేషన్ తదితర రంగాలలో చైనా దిగుమతులపై భారీగా ఆధారపడటం జాతీయ భద్రతను సవాల్ చేస్తున్నట్లు హెచ్చరించారు. ఆ విధమైన స్పష్టమైన హెచ్చరికలు ఉన్నప్పటికి రెండు దేశాల మధ్య వాణిజ్య లోటు భర్తీ చేయడం కోసం, చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడం కోసం భారత ప్రభుత్వం చేయవలసిన కృషి చేయడం లేదని భావించవలసి వస్తున్నది.

# మహిళలను రాణులుగా మారుస్తున్న ముద్ర..




**హైదరాబాద్,,తెలంగాణ దిశ:**ఒక కుటుంబంలో చదువుకున్న మహిళ ఉంటే ఆ కుటుంబం ఎంతో ఉన్నత స్థాయికి చేరుతుంది అన్న సంగతి అందరికీ తెలిసిందే. ఆ కుటుంబంతోపాటు సమాజం, దేశం కూడా ప్రగతి నడుస్తాయి. మహిళలు పారిశ్రామిక రంగంలో ఎదిగితే మరింత ప్రయోజనాలు కలుగుతాయి. ఆమె ఉన్నత స్థాయికి చేరడంతో పాటు ఆ పారిశ్రామిక రంగంలో ఉన్న మిగిలిన చాలామందికి కూడా ఉపాధి కలుగుతుంది. పొదుపుకు ప్రాధాన్యత లభిస్తుంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం కూడా మహిళల అభ్యున్నతి కోసం ఇప్పటివరకు ఎన్నో చర్యలను చేపట్టింది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ముద్ర యోజన ద్వారా ఎంతో మంది మహిళలకు ప్రోత్సాహం అందిస్తుంది. అప్పటి రోజులలో మహిళలు ఎక్కువగా కూలి పనుల మీద ఆధారపడి బతికే వాళ్ళు. చిన్న పరిశ్రమల స్థాపన అనేది అప్పటి వారికి తెలియని అంశంగా ఉండేది. దీనికి ప్రధాన కారణం పెట్టుబడి అని చెప్పొచ్చు. అప్పట్లో తినడానికే తిండి లేక ఇబ్బంది పడే కుటుంబాలు పెట్టుబడిని ఎక్కడ నుంచి వస్తాయి. ఇటువంటి పరిస్థితిని పీఎంఎంవై చాలా సుమూలంగా మార్చిందని చెప్పొచ్చు.ఈ పథకం కింద మహిళలు రుణాలు పొంది టైలరింగ్ యూనిట్లు, బ్యూటీ పార్లల్స్, ఫుడ్ స్టాల్స్, అగ్రిపాసెసింగ్ యూనిట్స్ అలాగే దుకాణాలను కూడా ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు. ఇది వారి జీవితంలో ఆర్థిక పరిస్థితులతో పాటు సమాజంలో వాళ్లకు గొప్ప మార్పును కూడా మెరుగుపరిచిందని చెప్పడంలో సందేహం లేదు. మహిళలు ఆర్థికంగా మెరుగుపడినప్పుడు వాళ్ళ పిల్లల చదువు మరియు ఆరోగ్యం కూడా బాగుంటుంది. మహిళలు వాటికి ఖర్చు చేయగలిగితే వారి ఆర్థిక స్తోమత కూడా మెరుగుపడుతుంది. ఈ క్రమంలో రాబోయే భవిష్యత్తు తరాలు ఉన్నతంగా ఎదుగుతాయి. ఈ విధంగా పీఎం ఎం వై సూక్ష్మ వ్యవస్థాపకులను ప్రోత్సహించడంతో పాటు సాధికారత మరియు ఆర్థికంగా చురుకైన మహిళలను తయారు చేస్తుందని చెప్పొచ్చు. ప్రధానమంత్రి ముద్ర యోజన రుణాలు తీసుకున్న వాళ్లలో సుమారు 68% వరకు మహిళలే ఉన్నారు.ఈ పథకం కింద రుణం తీసుకున్న మహిళలకు సిఏజిఆర్ 16 నుంచి 25 ఆర్థిక సంవత్సరాల మధ్య 13%గా ఉంటుంది. ఈ క్రమంలో మహిళల పొదుపులో 14% పెరిగాయి. ఈ పథకం కింద రుణాలను తీసుకోవడంతోపాటు వాటిని ఉపయోగించడం వలన జరిగిన ఆర్థిక ప్రగతిని కూడా ఇవి సూచిస్తున్నాయని తెలుస్తుంది. ప్రస్తుతం పీఎంఎంవై మెరుగైన ఫలితాలు సాధించిన క్రమంలో మహిళల సాధికారత మరియు ప్రగతి కోసం ప్రభుత్వం మరింత కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. అర్హులైన మహిళలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వడం అలాగే వ్యాపార విస్తరణకు అవకాశం కల్పించడం వంటివి చేయాల్సి ఉంది.


# చెల్లెమ్మకు దారేది..?



**కడప,తెలంగాణ దిశ:** వైఎస్ షర్మిల పయనమెటో తెలియడం లేదు. కాంగ్రెస్ పార్టీలో ఉండి ఆమెకు రాజకీయంగా ఎలాంటి పదవి లభించే అవకాశాలు కనిపించడం లేదు. దేశంలో ఇండి కూటమి వచ్చే సంకేతాలు అస్సలు కనిపించడం లేదు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ లో కూడా కాంగ్రెస్ ఇక కోలుకునే పరిస్థితి లేదు. నాయకులు లేరు. క్యాడర్ లేని పార్టీని ప్రజలు ఆదరించరన్నది అందరికీ తెలిసిందే. మరొక వైపు వైఎస్ షర్మిల నాయకత్వంపై ఉన్న నేతల్లోనూ అసంతృప్తి నెలకొంది. ఆమె మీడియాకు మాత్రమే పరిమితమవుతున్నారని, పీసీసీ చీఫ్ గా పార్టీ బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు బలంగా వినిస్తున్నాయి. అనేక మంది కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పార్టీని వీడి వెళ్లిపోతున్నారు.. అప్పుడప్పుడు హైదరాబాద్ నుంచి విజయవాడకు రావడం వైఎస్ జగన్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేయడం, చంద్రబాబు ప్రభుత్వంపై నామమాత్రపు ఆరోపణలకు దిగుతూ ఆమె మమ అనిపించేస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమైన నేతలందరూ పార్టీని వదిలి వెళ్లిపోయారు. సొంత జిల్లాలోనూ ఆమెకు గ్రిప్ దొరకడం లేదు. గత ఎన్నికల్లో జగన్ ను ఓడించగలిగానన్న తృప్తి మినహాయించి ఆమెకు రాజకీయంగా ఒరిగిందేమీ లేదు. కాంగ్రెస్ పార్టీలో తన తెలంగాణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విలీనం చేసినప్పుడు రాజ్యసభ పదవి ఇస్తామని చెప్పారన్న ప్రచారం జరిగింది. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ హామీ మేరకే షర్మిల ఈ స్టెప్ తీసుకున్నారని కూడా చెబుతారు.

అయితే ఇప్పుడు వైఎస్ షర్మిలను కేంద్ర నాయకత్వం కూడా పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. డీకే శివకుమార్ ను ఇటీవల కలసినప్పుడు కూడా ఆయన కూడా రాజ్యసభ విషయంలో తన నిస్సహాయతను వ్యక్తం చేసినట్లు సమాచారం. ఏమీలేని రాష్ట్రంలో చీఫ్ గా ఉన్న నేతకు రాజ్యసభ పదవి ఇవ్వడం అనవసరమని బహుశ కేంద్ర నాయకత్వం భావించి ఉండవచ్చు.

కాంగ్రెస్ లో సీనియర్ నేతలు అనేక మంది ఉన్నారు. రాహుల్ గాంధీ, సోనియాకు అత్యంత ఆప్తులైన నేతలు అనేక మంది పెద్దల సభలో తమకు స్థానం దక్కుతుందని భావిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో టెన్ జన్ పథ్ వైఎస్ షర్మిల వైపు చూసే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పుడు కాదు కదా.. వచ్చే ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో కనీసం ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకునే అవకాశాలు కనిపించడం లేదు. పదిహేనేళ్లన నుంచి అంటే 14 రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కాంగ్రెస్ పార్టీ కోలుకునే పరిస్థితి లేదు. ఇక కోలుకోనే అవకాశాలు కూడా లేవు. టీడీపీ, వైసీపీ వంటి బలమైన పార్టీలు కూడా కాంగ్రెస్ ను కలుపుకుని పోయేందుకు ప్రయత్నించవు. అందుకే తమకు దగ్గరగా ఉన్న ఏమీ ఓటు బ్యాంకులేని కాలం చెల్లిన సిద్ధాంతాలతో పయనిస్తున్న కమ్యునిస్టులతోనే ప్రయాణం సాగించాల్సి ఉంటుంది. అందుకే వైఎస్ షర్మిలకు రాజకీయ భవిష్యత్ కనుచూపు మేరలో కనిపించడం లేదు.



## ఆఫ్రికా దేశం నుంచి భారత్‌కు మరో 8 చీతాలు

**ఢిల్లీ,:** దేశంలో అంతరించిపోయిన చీతాల పునరుద్ధరణ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విషయం తెలిసిందే. ప్రాజెక్ట్ చీతాలో భాగంగా ఆఫ్రికా నుంచి విడతల వారీగా చీతాలను భారత్‌కు తీసుకొస్తున్నారు. గతంలో దక్షిణాఫ్రికా, నమీబియా నుంచి విడతల వారీగా చీతాలను భారత్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మరో 8 చీతాలు రానున్నాయి. దక్షిణ ఆఫ్రికాలోని బోట్స్‌వానా నుంచి రెండు విడతల్లో చీతాలను భారత్‌కు తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి జాతీయ పులుల సంరక్షణ అథారిటీ సమాచారం ఇచ్చింది. తొలి విడతలో భాగంగా మేలో 4 చీతాలను తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. ఆ తర్వాత మరో నాలుగు చిరుతలను తీసుకొచ్చేందుకు ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. దేశంలో చిరుత ప్రాజెక్ట్ కోసం ఇప్పటివరకు రూ.112 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. అందులో 67 శాతం మధ్యప్రదేశ్‌లో చిరుత పునరావాసానికి వెళ్లిందని వెల్లడించారు. కాగా, ప్రాజెక్ట్ చీతాలో భాగంగా కేంద్రం 22, సెప్టెంబర్ 17న నమీబియా నుంచి ఎనిమిది చిరుతలను భారత్‌కు తీసుకొచ్చింది. అందులో ఐదు ఆడ చీతాలు, మూడు మగ చీతాలు ఉన్నాయి. ఆ తర్వాత ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా నుంచి మరో 12 చిరుతలు వచ్చాయి. వీటన్నింటినీ మధ్యప్రదేశ్‌లోని కూనో నేషనల్ పార్క్‌లో వదిలారు. ఆ తర్వాత అనారోగ్య కారణాలతో పలు చిరుతలు మృతి చెందాయి. ప్రస్తుతం కూనో పార్క్‌లో 26 చిరుతలు ఉన్నాయి. వాటిలో 14 భారత్‌లో జన్మించిన కూన పిల్లలు. దేశంలో 71 ఏండ్ల క్రితం అంతరించి పోయిన చీతాలను ప్రభుత్వం మళ్లీ పునరుద్ధరిస్తు న్నది. ఇందులో భాగంగా ఆఫ్రికా దేశాల నుంచి విడుతల వారీగా దిగుమతి చేసుకుంటున్నది. కాగా, ప్రపంచంలోని 7 వేల చిరుతల్లో అధికంగా దక్షిణాఫ్రికా, నమీబియా, బోట్స్‌వానాలో నివసిస్తున్నాయి. అయితే నమీబియాలోనే చీతాలు అత్యధికంగా ఉన్నాయి.



# అణు చట్టాల్లో మార్పులు?

## అమెరికా సంస్థల కోసం మోడీ సర్కారు అడ్డగోలు చర్యలు విదేశీ కంపెనీలకు అవకాశమిస్తూ పార్లమెంటు సమావేశాల్లో సవరణలకు చర్యలు

**న్యూఢిల్లీ :** భారత్‌లోని అణు బాధ్యత చట్టాల్లో మోడీ సర్కారు మార్పులు తీసుకురానున్నట్టు తెలుస్తున్నది. విదేశీ సంస్థలను ఆకర్షించటం కోసం వీటిని సులభతరం చేసేందుకు కేంద్రం యోచిస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వంలోని కొన్ని విశ్వసనీయ వర్గాలు ఈ విషయాన్ని తెలిపాయి. ఎక్విప్‌మెంట్ సప్లయర్స్(పరికరాల సరఫరాదారులు)పై ప్రమాద సంబంధిత జరిమానాలను పరిమితం చేయటానికి భారత్ తన అణు బాధ్యత చట్టాలను సులభతరం చేయాలని యోచిస్తున్నదని వివరించాయి. ముఖ్యంగా, యూఎస్ సంస్థలను ఆకర్షించే ప్రయత్నంలో భాగంగా మోడీ సర్కారు ఈ మార్పులు తీసుకురావటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అమెరికా అణు సంస్థలను ఆకర్షించటం ద్వారా 47 నాటికి అణు విద్యుత్ సామర్థ్యాన్ని 12 రెట్లు పెంచి 100 గిగావాట్స్ (జీడబ్ల్యూ)కి చేరుకోవటాన్ని భారత్ లక్ష్యంగా పెట్టుకున్నది. మోడీ సర్కారు అటువైపుగా ప్రతిపాదనలను చేస్తున్నట్టు తెలిసింది.

చట్టంలోని కీలక నిబంధన తొలగింపు: ఇందులో భాగంగా.. అణుశక్తి విభాగం రూపొందించిన ముసాయిదా చట్టం.. పౌర అణు బాధ్యత నష్ట చట్టం, 10లోని కీలకమైన నిబంధనను తొలగిస్తుందనీ, ఇది సరఫరాదారులను ప్రమాదాలకు అపరిమిత బాధ్యతకు గురి చేస్తున్నదని సంబంధిత వర్గాలు వివరించాయి. అయితే, ఈ విషయంలో భారత అణుశక్తి విభాగం, ప్రధాన మంత్రి కార్యాలయం (పీఎంఓ), ఆర్థిక మంత్రిత్వ శాఖ లు ఇప్పటి వరకు స్పందించలేదు. భారత్‌కు స్వచ్ఛమైన, అత్యవసర అణుశక్తి అవసరమని డెలాయిట్ దక్షిణాసియా చీఫ్ గ్రోత్ ఆఫీసర్ దేబాసిశ్ మిశ్రా తెలిపారు. బాధ్యత పరిమితి అణు రియాక్టర్ల సరఫరాదారుల ప్రధాన ఆందోళనను తొలగిస్తుందని చెప్పారు. ఈ మార్పులు ప్రధానంగా అపరిమిత ప్రమాదాల కారణంతో ఏండ్లుగా దూరంగా ఉన్న జనరల్ ఎలక్ట్రిక్ కో, వెస్టింగ్ హౌస్ ఎలక్ట్రిక్ కో వంటి యూఎస్ సంస్థల ఆందోళనలను తగ్గిస్తాయని భారత ప్రభుత్వం ఆశిస్తున్నది.

అమెరికాతో వాణిజ్యం కోసం..: అమెరికాతో వాణిజ్యం కోసం భారత్ ఈ చట్టం ఆమోదాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అంటున్నారు. గతేడాది 191 బిలియన్ డాలర్ల(రూ.16.30 లక్షల కోట్లకు పైగా) నుంచి 30 నాటికి 500 బిలియన్ డాలర్ల(రూ.42.69 లక్షల కోట్లకు పైగా)కు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంచే లక్ష్యంతో భారత్,

యూఎస్ మధ్య ఈ ఏడాది వాణిజ్య ఒప్పంద చర్చల కోసం సవరించిన చట్టం ఆమోదం చాలా కీలకమని విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది జులైలో ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో సవరణలకు ఆమోదం లభిస్తుందని మోడీ సర్కారు విశ్వసిస్తున్నట్టు తెలిసింది. ప్రతిపాదిత సవరణల ప్రకారం.. ప్రమాదం జరిగినపుడు సరఫరాదారు నుంచి పరిహారం పొందే ఆపరేటర్ హక్కు.. ఒప్పందం విలువకు పరిమితం చేయబడుతుంది. ఇది ఒప్పందంలో పేర్కొనవల్సిన కాలానికి కూడా లోబడి ఉంటుంది. అయితే, ఒక ఆపరేటర్ సరఫరాదారుల నుంచి కోరే పరిహారం మొత్తానికి, విక్రేతను ఎంతకాలం వరకు జవాబుదారీగా ఉంచవచ్చనే దానిపై చట్టం పరిమితిని నిర్వచించలేదు. ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన పారిశ్రామిక ప్రమాదమైన భోపాల్ గ్యాస్ విపత్తు నుంచి భారతదేశ అణు బాధ్యత చట్టం,

10 ఉద్భవించింది. భోపాల్ గ్యాస్ విపత్తు ఘటనలో యూఎస్ మల్టీనేషనల్ యూనియన్ కార్బైడ్ కార్ప్ యాజమాన్యంలోని కర్మాగారంలో 5000 మందికి పైగా మరణించారు. యూనియన్ కార్బైడ్ 1989లో కోర్టు వెలుపల 470 మిలియన్ డాలర్ల నష్టపరిహారాన్ని చెల్లించటానికి అంగీకరించింది. ప్రస్తుత అణుబాధ్యత చట్టం విదేశీ కంపెనీలను మార్కెట్ నుంచి సమర్థవంతంగా మూసివేసింది. అలాగే, 08 అణు సహకారంపై ఒప్పందం కుదుర్చుకున్నప్పటి నుంచి యూఎస్–భారత్ సంబంధాలను దెబ్బతీసింది.

'అణు'పెట్టుబడులపై కేంద్రంతో భారతీయ కంపెనీల చర్చలు: పెరుగుతున్న ఇంధన డిమాండ్ నేపథ్యంలో భారత్ అణుశక్తిపై ప్రధానంగా దృష్టి సారించిందని నిపుణులు చెప్తున్నారు. ఇందులో భాగంగా ప్రయివేటు భారతీయ కంపెనీలు అలాంటి ప్లాంట్లను నిర్మించటానికి అనుమతించాలని ప్రతిపాదించింది. రిలయన్స్ ఇండిస్ట్రీస్, టాటాపవర్, అదానీ పవర్, వేదాంత లిమిటెడ్ వంటి భారతీయ కంపెనీలు ఈ రంగంలో దాదాపు 5.14 బిలియన్ డాలర్ల(రూ.43,888 కోట్లకు పైగా) చొప్పున పెట్టుబడి పెట్టేందుకు ఇప్పటికే చర్చలు జరపటం గమనార్హం.

# ఎవ్వరిని ఎదగనీయకుండా విశ్వరూపం

ఏలూరు,తెలంగాణ దిశ: మర్రి చెట్టు నీడలో ఏ చెట్టూ ఎదగదంటారు.. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వటవృక్షంతో మాజీ మంత్రి విశ్వరూప్ కుటుంబాన్ని ఆ పార్టీలోనే కొందరు నేతలే ఉదాహరణగా చెప్పుకుంటున్న వేళ.. వైసీపీ అధిష్టానం అందరికీ షాక్ ఇచ్చే న్యూస్ విడుదల చేసింది. వైసీపీ అధికారంలో వచ్చిన తరువాత మంత్రి పదవిని దక్కించుకున్న విశ్వరూప్.. ఆ తరువాత మంత్రివర్గ విస్తరణలో వైసీపీలో హేమాహేమీలుగా ముద్ర వేసుకున్న పేర్ని నాని, కొడాలి నాని లాంటి వాళ్లే మంత్రి పదవిని కోల్పోయినా విశ్వరూప్ మాత్రం మళ్లీ మంత్రి పదవిని కాపాడుకోవడమే కాకుండా ఇంకా మంచి పోర్టుపోలియో దక్కించుకున్నారు. పార్టీ టిక్కెట్టు విషయంలో టిక్కెట్టు దక్కించుకున్న విశ్వరూప్ ఓటమి తరువాత వైసీపీ జిల్లా అధ్యక్షునిగా పదవిని సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉంటే తాజాగా వైసీపీ విడుదల చేసిన ఓ ప్రకటనలో అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తగా విశ్వరూప్, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఆయన తనయుడు శ్రీకాంత్‌ను నియమిస్తూ పార్టీ అధినేత జగన్ నిర్ణయం తీసుకోవడం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది..ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం అయిన అమలాపురంలో విశ్వరూప్ పార్టీలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ద్వితీయశ్రేణి నాయకులను ఎవ్వరినీ ఎదగనీయరన్న ఆరోపణలు ఆ పార్టీ నుంచే వినిపిస్తున్నాయి. రేపన్నాక పార్టీలో టిక్కెట్టు రేసులో అడ్డువస్తారన్న ఆలోచనతోనే ఆర్థికంగా, సామాజికంగా బలం ఉన్నవారు ఎవ్వరైనా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తుంటే ఏదోలా వారిని తన అనుచరగణంతో అడ్డుకట్టవేసే ప్రయత్నం చేస్తుంటారన్న విమర్శలున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీలో చురుగ్గా ఉండే దళిత నాయకులకు పోటీచేసే అవకాశం కల్పించకపోవడం, వారిని కలుపుకోకుండా పక్కనపెట్టడం వంటి చర్యలుతో చేదు అనుభవాన్ని చవిచూసిన వారు చాలా సందర్భాల్లో అసంతృప్తిని వ్యక్తం చేసిన సందర్భాలు నియోజకవర్గంలో కనిపించాయి. ఈ కారణంచేతనే చాలా మంది పార్టీని వీడి వేరే పార్టీల్లోకి వెళ్లిపోయారని చెబుతుంటారు. తాజాగా వైసీపీ ప్రకటించిన పార్టీ పదవుల్లో పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్త పదవులు దక్కించుకోవడంపై వైసీపీలోనే అసంతృప్తి జ్వాలలు నివురుగప్పిన నిప్పులా మారాయి.కోనసీమలో దళిత వర్గం నుంచి వైసీపీలో కీలక నేతగా ఉన్న పినిపే విశ్వరూప్ ఆపార్టీ చాలా ప్రాధాన్యతనిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే దళిత వర్గంలోనే చాలా మంది ఔత్సాహిక కీలక నాయకులున్నా వారు కేవలం పార్టీ కార్యకర్తలుగానే మిగిలిపోతున్నామన్నది వారి వాదన కాగా తాజా పరిణామాలను పరిశీలిస్తే కోనసీమలో ఎస్సీ వర్గం నుంచి విశ్వరూప్ కుటుంబం తప్ప వేరే ఆప్షన్ లేదన్నట్లుగా రెండు కీలక పదవులు కట్టబెట్టడం చూస్తే ఇదే ఆలోచనలో ఉందా అన్నది స్పష్టం అవుతుంది. అయితే పార్టీ తీసుకున్న ఈనిర్ణయం పట్లా సొంత పార్టీలోనే విమర్శలు ఎదురవుతున్నాయి.. విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ అనే వాలంటీరు హత్యకేసులో అభియోగాలను ఎదుర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితునిగా ఉన్నారు కూడా. అయితే అవేమీ వైసీపీ పట్టించుకోకుండా తాజాగా ప్రకటించిన పదవుల్లో డాక్టర్ శ్రీకాంత్‌కు కీలకమైన అమలాపురం అసెంబ్లీ నియోజవర్గ సమన్వయకర్త పదవిని కట్టబెట్టింది.

గత కొన్ని రోజులుగా జిల్లా అధ్యక్షుడ్ని మారుస్తారన్న ప్రచారం జోరుగా సాగినా అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా విశ్వరూప్‌నే కొనసాగిస్తారని, ఆయన తనయుడు

శ్రీకాంత్ విషయంలో వాలంటీర్ హత్య కేసు అభియోగాలు అడ్డంకిగా మారతాయని అంతా భావించారు. అయితే వైసీపీ అధిష్టానం నిర్ణయం స్థానికంగా చర్చకు దారితీసింది. మొన్నటి సాధారణ ఎన్నికల్లో అమలాపురం వైసీపీ అసెంబ్లీ టిక్కెట్టు విషయంలో తండ్రీ కొడుకుల మధ్య వార్ నడిచిందని గుసగుసలు వినిపించాయి.

ఒక దశలో తన తండ్రి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా టిక్కెటు తనకే కేటాయించాలని శ్రీకాంత్ కోరినట్లు వార్తలు వచ్చాయి. అయితే అమలాపురంలో పోటీచేసేది నేనే అంటూ విశ్వరూప్ ప్రకటించడంతో ఆ వివాదం సద్దుమణిగింది. అయితే

ఆ తరువాత శ్రీకాంత్ నియోజకవర్గానికి దూరం అయ్యారు. అయితే దీనిపై కూడా పలు విమర్శలు వచ్చాయి. తండ్రికి అమలాపురం, కుమారునికి పి.గన్నవరం టిక్కెట్టు కేటాయిస్తారనే ఈతరహా మైండ్ గేమ్ ఆడారన్న గుసగుసలు వినిపించాయి..

# భారీగా పెరుగుతున్న కాస్ట్ ఆఫ్ లివింగ్

**హైదరాబాద,తెలంగాణ దిశ:** ప్రాథమిక విద్య పూర్తి అయిన తర్వాత ఉన్నత విద్యా కోసం చాలామంది విద్యార్థులు పట్టణాలకు లేదా నగరాలకు వెళుతూ ఉంటారు. పట్టణాల్లో చదువు పూర్తి చేసుకున్న వారు ఉపాధి కోసం నగరాలకు వెళుతూ ఉంటారు. తెలంగాణలో ఏ మూలనో ఉన్న వారు సైతం హైదరాబాదులో జీవించాలని కోరుకునే వారు ఎక్కువగానే ఉన్నారు. ఎందుకంటే హైదరాబాదులో ఏదో ఒక పని చేసుకుంటూ ఉపాధి పొందవచ్చని.. అలాగే డబ్బు బాగా సంపాదించవచ్చని అనుకుంటారు. అయితే ప్రస్తుత కాలంలో జీతాలతో పాటు.. ఖర్చులు కూడా బాగానే పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంటి అద్దె విషయంలో తడిసి మోపెడ అవుతుందని ఇక్కడకి వలస వచ్చిన వారు చెబుతున్నారు. వచ్చే జీవితంలో సగం వరకు ఇంటి అద్దె చెల్లించడానికి సరిపోతుందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం అద్దె రేట్లు హైదరాబాదులో ఎలా ఉన్నాయో చూద్దాం..ఇటీవల ఇన్ఫో మెన్స్ ఆన్లైన్ మీడియా స్టార్ టాప్ ఇన్ఫర్మేషన్ ప్లాట్ ఫామ్ ఓ సర్వే నిర్వహించింది. హైదరాబాదులో లివింగ్ కాస్ట్ ఎలా ఉంది? అనే దానిపై రీసెర్చ్ చేసి వివరాలను బయటపెట్టింది. ఈ పరిశోధనలో భాగంగా మొత్తం దేశవ్యా ప్తంగా 10 ప్రధాన నగరాలను ఎంచుకుంది. ఇందులో ముంబై రూము 35, 887 తో మొదటి స్థానంలో ఉండగా.. జైపూర్ 27,813 తో చివరి స్థానంలో నిలిచింది.హైదరాబాదు ఆరవ స్థానంలో నిలిచింది.హైదరాబా దులో జీవించాలంటే నెలకు కనీసం 30 నుంచి 50 వేల వరకు ఖర్చు అవుతుందని ఈ సంస్థ తెలిపింది. ఇందులో ప్రధానంగా అద్దె ఇంటికి రూ.8, 000 చెల్లించాల్సిందే. ఇది కూడా సింగిల్ రూమ్ మాత్రమే. కాస్త ఫ్లెక్సిబుల్ రూమ్ కావాలంటే కనీసం రూపం 15 వేల వరకు అవుతుంది. ఇక కిరాణా ఖర్చులు, రవాణా ఖర్చులు, నిత్యవసరాలు, అదనపు ఖర్చులు కలిపి మొత్తం 31,000 అవుతుందని ఈ సంస్థ తెలిపింది.



# ఆకలి సరిగ్గా అవడం లేదా.. ఆహారం తినాలనిపించడం లేదా.. అయితే ఈ చిట్కాలను పాటించండి..

**తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే అజీర్తి ఏర్పడుతుంది. దీంతో ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తింటారు. ఆకలి తగ్గేందుకు పలు ఇతర కారణాలు కూడా ఉంటాయి. జీర్ణాశయం లో ఎంజైమ్‌లు లేదా జీర్ణ రసాల ఉత్పత్తి తగ్గడం, లివర్ పనితీరు మందగించడం, మలబద్దకం, గ్యాస్ వంటి సమస్యలు ఉండడం వంటి కారణాల వల్ల కూడా ఆకలి ఉండదు. దీంతో ఆహారం సరిగ్గా తినలేకపోతుంటారు. అయితే పలు రకాల చిట్కాలను పాటిస్తే అజీర్తిని తగ్గించి ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేయవచ్చు. దీంతో ఆకలి కూడా పెరుగుతుంది. ఆకలి అసలు లేని వారు కొన్ని చిట్కాలను పాటిస్తే ఎంతో మేలు జరుగుతుంది. ఇక ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.**

**మిరియాలు..:** ఆకలిని పెంచడంలో మిరియాలు అద్భుతంగా పనిచేస్తాయి. మిరియాలను పొడిగా చేసి చిటికెడు మోతాదులో తీసుకుని కాస్త తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం భోజనానికి 30 నిమిషాల ముందు చప్పరించాలి. దీంతో అజీర్తి తగ్గుతుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. మిరియాల పొడిని మజ్జిగలో కలిపి తాగుతున్నా ఉపశమనం లభిస్తుంది. ఆకలి పెరుగుతుంది. మిరియాలలో అనేక యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతాయి. జీర్ణ రసాలు సక్రమంగా ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో ఆకలి పెరుగుతుంది. మిరియాలను తేనెతో కలిపి తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మలబద్దకం తగ్గుతుంది. మిరియాలతో కషాయం తయారు చేసి కూడా తాగవచ్చు.

**అల్లం రసం..:** ఆకలిని పెంచేందుకు అల్లం రసం కూడా ఎంతో పనిచేస్తుంది. ఒక టీస్పూన్ అల్లం రసాన్ని ఉదయం, సాయంత్రం భోజనానికి ముందు సేవించాలి. అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవన్నీ పైత్యాన్ని తగ్గిస్తాయి. వికారం, అజీర్తి సమస్యల నుంచి బయట పడేస్తాయి. ఆకలి పెరిగేలా చేస్తాయి. ఆకలి లేని వారు రోజూ అల్లం రసాన్ని తాగుతుంటే ఫలితం ఉంటుంది. అలాగే ఉసిరికాయ జ్యూస్‌ను రోజూ తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఉసిరికాయల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థలో ఉండే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తాయి. దీంతో అజీర్తి తగ్గి ఆకలి పెరుగుతుంది. రోజూ ఉదయం పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో ఉసిరికాయ జ్యూస్‌ను తాగుతుంటే మంచి ఫలితం ఉంటుంది.

**యాలకులు..:** యాలకులను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. భోజనం చేసిన తరువాత రాత్రి పూట ఒక యాలక్కాయను నేరుగా అలాగే నమిలి తినాలి. ఇది అజీర్తిని తగ్గిస్తుంది. జీర్ణాశయంలో గ్యాస్ ఉత్పత్తిని అరికడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీంతో ఆకలి పెరుగుతుంది. యాలకులను తినడం వల్ల రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. అలాగే నోట్లో ఉండే బ్యాక్టీరియా తగ్గుతుంది. నోటి దుర్వాసన నుంచి ఉపశమనం లభిస్తుంది. యాలక్కాయను రాత్రిపూట తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నిద్ర చక్కగా పడుతుంది. పిప్పిళ్ల చూర్ణం పావు టీస్పూన్ మోతాదులో తీసుకుని దానికి ఒక టీస్పూన్ తేనెను కలిపి రాత్రి పూట నిద్రకు ముందు తీసుకోవాలి. ఈ మిశ్రమం ద్వారా ఆకలి పెరగడమే కాదు, పొట్ట దగ్గరి కొవ్వు కూడా కరుగుతుంది. ఇలా పలు చిట్కాలను పాటిస్తే ఆకలిని పెంచుకోవడమే కాదు, ఇతర ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

# అట్టడుగు వర్గాలను ఆదుకోవడంలో నిర్లక్ష్యం..!

న్యూఢిల్లీ, : సామాజిక న్యాయం అంటే సమాజంలో అట్టడుగున ఉన్న దళితులు, ఆదివాసీలు, బడుగు బలహీనవర్గాలవారు ఇతర కులాలతో పాటు సమానంగా అభివృద్ధి కావడం. అంటరానితనం, కుల వివక్ష అంతం కావాలి. బలహీనులపై దాడులు చేసిన మోతుబరులతో రాజీ కుదిర్చే అధికార యంత్రాంగం తీరు మారి, 'చట్టం తన పని తాను చేసుకునేలా' రూపొందడం విధానాల మార్పు ద్వారానే సాధ్యం. గిరిజనులు కేంద్రీకరించివున్న 30 మండలాల్లో సగం ఆవాసాలకు కనీసం రోడ్డు కూడా లేదని రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు ఘోషిస్తున్నాయి. మహిళపై నేరాలు నానాటికీ పెచ్చరిల్లుతున్నాయి. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులు, మహిళలు, మైనార్టీ తరగతుల సమస్యల పరిష్కారానికి రాయితీలు కల్పించడం మాత్రమే పరిష్కారం కాదు. శ్రామికులకు, ఆరుగాలం కష్టపడ్డ అన్నదాతలకు శ్రమకు తగిన ప్రతిఫలం దక్కడంలేదు. వారి కష్టఫలితం వారికి దక్కితేనే జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. అదే విధంగా కార్మికులకు కనీసవేతనం 18 వేలు చెల్లించడంతోపాటు, కార్మిక చట్టాలను పటిష్టపర్చడం అవసరం. అప్పుడో ఇప్పుడో నష్ట పరిహారం లేదా సబ్సిడీ ఇవ్వడం కాకుండా పంట పండించడానికి చేసిన ఖర్చుకు 50 శాతం అదనంగా ధర రైతుకు చెల్లించేలా చట్టం చేయాలి. కౌలురైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల ప్రత్యామ్నాయ కార్యక్రమం స్పష్టమైన డిమాండ్లు రూపొందించింది. యువ ఉద్యోగులు, ఉపాధ్యాయుల మెడ మీద కత్తిలా వేలాడుతున్న సిపిఎస్ విధానాన్ని తెచ్చింది వాజ్‌పాయి ప్రభుత్వమే. మన్మోహన్ సింగ్‌తో పాటు రాజశేఖరరెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాలు దాన్ని యధాతథంగా అమలు చేశాయి. సిపిఎస్ రద్దు చేస్తామని 14లో హామీనిచ్చిన చంద్రబాబు ఆ ఊసే ఎత్తలేదు. పెట్టుబడిదారీ విధానాన్ని అమలు చేస్తున్న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర పాలక పార్టీలు ఖజానాను సంపన్నులకు దోచిపెట్టడమేగాక అవినీతిని పెంచి పోషిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు ఆదేశిత సంస్కరణలు, జలయజ్ఞం వగైరా అవినీతి అందరికీ తెలిసిందే! అవినీతి రహితంగా ప్రభుత్వ పాలన, పారదర్శకంగా నిర్ణయాలు, పంచాయతీలకు మున్సిపాలిటీలకు నిధులు వంటి అంశాలను ప్రత్యామ్నాయ కార్యక్రమం పేర్కొంది. రాజకీయ అవినీతిని అంతం చేయడం ప్రత్యామ్నాయ శక్తులకే సాధ్యం. ఎన్నికల సంస్కరణలు, ప్రధానంగా దామాషా ఎన్నికల విధానం నేటి అవసరం. మౌలికమైన భూమి సమస్య మొదలు విశ్వ వ్యాపితమైన పర్యావరణ అంశం వరకు అనేక విషయాలపై ప్రత్యామ్నాయ కార్యక్రమం పూర్తిగా సామాన్య పజల కోర్కెలను ప్రతిబింబించేదిగా వుంది. సంపన్నుల కొమ్ముకాసే చర్యలవల్ల కొద్దిమంది కోటీశ్వరులవుతున్నారు. కాబట్టి ఈ విధానాలకు ప్రత్యామ్నాయం రావాలి.

# ఆతిథ్యంలోనూ అత్తెసరే..



అతిథి మర్యాదలు చేయడంలో ఆడవాళ్లే ముందుంటారు. ఇంటికి చుట్టాలు వచ్చినా.. స్నేహితులు వచ్చినా ఆత్మీయంగా చూసుకుంటారు. అందుకే.. ఆతిథ్యరంగంలోనూ ఆడవాళ్లే ఆధిపత్యం చెలాయిస్తున్నారు. హాస్పిటాలిటీలో మహిళల వాటా 52 శాతంగా లెక్కతేలింది. అయితే.. నాయకత్వంలో మాత్రం వెనకబడి పోతున్నారు. కేవలం 30 శాతం మంది మాత్రమే కీలక పదవుల్లో ఉంటున్నారట. 'ఎంపవరింగ్ ఉమెన్ ఇన్ హాస్పిటాలిటీ' నిర్వహించిన ఓ సర్వే ఇందుకు సంబంధించిన అనేక విషయాలను వెల్లడించింది. ఆతిథ్య రంగంలో మహిళలు అద్భుతమైన పురోగతి సాధిస్తున్నా.. ఉన్నత స్థాయిల్లో వారికి ఎదురుదెబ్బలే తగులుతున్నాయని ఈ సర్వే పేర్కొంటున్నది. హాస్పిటాలిటీ రంగంలో 23 వరకు సీఈవో స్థాయిల్లో మహిళల వాటా కేవలం 6 శాతం మాత్రమే. ఇక వేతనాల్లోనూ మహిళలపట్ల వివక్ష కనిపిస్తున్నట్లు తేలింది. ఆతిథ్య, పర్యాటక రంగాల్లో పురుషుల కంటే మహిళలు సగటున 14.7 శాతం తక్కువగా వేతనం అందుకుంటున్నారట. అయితే, గతేడాదితో పోలిస్తే వారి జీతభత్యాలు 4.2 శాతం నుంచి 5.2 శాతానికి పెరగడం గమనార్హం. వృత్తిపరమైన విభజన వల్లే ప్రమోషన్లు, జీతాల్లో అసమానత ఉన్నదని పరిశోధకులు అంటున్నారు. జీతాలు అందించే నాయకత్వ పదవుల్లో పురుషులే ఎక్కువగా ఉంటున్నారు. తక్కువ వేతన ఉద్యోగాలైన ఫ్రంట్‌లైన్ సర్వీసుల్లో మహిళల ప్రాతినిధ్యం ఎక్కువ.

దాంతోపాటు ఇంటి సంరక్షణ బాధ్యతల కారణంగా మహిళలు పార్ట్‌టైమ్, సౌకర్యవంతమైన పాత్రల్లోనే పనిచేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది వారి ప్రమోషన్‌లు, వేతన పెరుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని సర్వేకారులు వెల్లడించారు. అయితే, ఆతిథ్యరంగంలో మహిళలకు మార్గదర్శకత్వం కల్పించడంతోపాటు, ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌లను విస్తరించడం వల్ల వాళ్లు మరింతగా రాణించే అవకాశం ఉన్నదని చెబుతున్నారు.

# కొబ్బరినీళ్లకు తోడుగా..

వేసవితాపాన్ని తీర్చడంలో కొబ్బరినీళ్లు ముందుంటాయి. పొటాషియం, మెగ్నీషియం, సోడియంలాంటి ఎలక్ట్రోలైట్లతోపాటు అనేక పోషకాలతో నిండిన ఈ నీళ్లు.. ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి. శరీరాన్ని హైడ్రేటె డ్‌గా ఉంచడంతోపాటు కండరాలు, నరాల పనితీరుకు మద్దతుని స్తాయి. అలాంటి కొబ్బరినీళ్లకు ఇతర పదార్థాలను జోడించడం ద్వారా మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు సమకూరుతాయి.

పుదీనా : కొబ్బరి నీళ్లకు పుదీనాను జోడిస్తే.. అద్భుతమైన రిఫ్రెషింగ్ డ్రింక్ తయారవుతుంది. ఇది శరీరాన్ని చల్లబరచడంతోపాటు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సమర్థంగా పనిచేస్తుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది. పుదీనాలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు.. రోగ నిరోధక శక్తిని పెంచుతాయి.

నిమ్మరసం : విటమిన్ సితోపాటు హైడ్రేషన్‌కు మద్దతునిచ్చే ఎంజైమ్‌లు నిమ్మరసంలో పుష్కలంగా ఉంటాయి. ఆమ్ల స్వభావం కలిగిన నిమ్మరసం, ఆల్కలీన్ కొబ్బరినీళ్లతో కలిసి.. శరీర పీహెచ్‌ను సమతుల్యం చేయడంలో సాయపడుతుంది.

తేనె : కొబ్బరినీళ్లకు తేనె కలిపి తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఆయుర్వేదం చెబుతున్నది. తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు, ఎంజైములు, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కొబ్బరినీటిలోని ఖనిజాలతో కలిసి.. ఇన్ఫెక్షన్లతో పోరాడే శక్తిని శరీరానికి అందిస్తాయి. రోగ నిరోధక




శక్తిని పెంచి ఆరోగ్యానికి అండగా నిలుస్తాయి.

చియా విత్తనాలు : ఫైబర్, ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా లభించే చియా విత్తనాలను కొబ్బరినీళ్లలో కలిపితే.. శరీరానికి కావాల్సిన శక్తినిచ్చే పానీయం సిద్ధమవుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. శరీరం ఎక్కువసేపు హైడ్రేటెడ్‌గా ఉండటంలో సహాయపడుతుంది. గుండె, మెదడు ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది.

నల్ల ఉప్పు : కొబ్బరినీళ్లలోని పొటాషియం, మెగ్నీషియం.. నల్ల ఉప్పులోని సోడియం, ఐరన్, సల్ఫర్ వంటి ఖనిజాలు కలిసి.. ఎలక్ట్రోలైట్ రిచ్ డ్రింక్‌గా తయారవుతుంది. నల్ల ఉప్పులోని కార్మినేటివ్ లక్షణాలు.. ఆకలిని నిరోధిస్తాయని ఆయుర్వేదం చెబుతున్నది. ఇవి కొబ్బరినీళ్లతో కలిసినప్పుడు జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

# దురలవాట్లతో కాలేయ అనారోగ్యం



కాలేయం లేదా లివర్ అనేది శరీర అవయవాల్లో అతి పెద్దది మాత్రమే కాకుండా అత్యంత ప్రధానమైనదిగా వైద్య రంగం వర్గీక రించింది. సక్రమ జీవ వ్యవస్థ కొనసాగింపు, విష పదార్థాలను వడపోసి విసర్జిం చడం, అత్యవసర జీవ పదార్థాలను తయారు చేయడం, జీర్ణ వ్యవస్థ నుంచి పోషకాలతో నిండిన మంచి రక్తాన్ని తీసుకొని శరీర అవయవా లకు సరఫరా చేయటం లాంటి 500 పైగా విధులను నిర్వహిస్తూ మనకు నిత్య ఆరోగ్య సౌభాగ్యాన్ని కాలేయం అందిస్తున్నది. మన చెడు అలవాట్ల ప్రభావం ప్రత్యక్షంగా కాలేయం మీదనే పడుతుందనే కనీస పరిజ్ఞానర మనకు వుండాలి. లివర్ ఆరోగ్యమే మన ఆరోగ్యమని తలచి జీవనశైలిని మార్చుకోవాలి. ప్రపంచవ్యాప్తం గా దాదాపు లక్షల మంది కాలేయ సంబంధ వ్యాధులతో చనిపోతున్నారని, మరణానికి కారణమైన వ్యాధుల్లో లివర్ వ్యాధులు కూడా ఉన్నాయని తెలుసుకోవాలి. అన్ని వయసుల వారిలో దాదాపు 30 శాతం మందిని కాలేయ సంబంధ రుగ్మతలు వేధిస్తున్నట్లు అంచనా వేస్తున్న వేళ మన కాలేయాన్ని మనమే రక్షించుకోవడం అత్యవసరం. శరీరానికి శక్తినిచ్చే కేంద్రంగా విలక్షణ విధులను నిర్వహిస్తున్న కాలేయం పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 19 ఏప్రిల్ రోజున "ప్రపంచ కాలేయ దినం" పాటిస్తున్నాం. ఈ ఏడాది ఇతివృత్తంగా "ఆహారమే ఔషధం" అనే అంశాన్ని తీసుకొని విస్తృత ప్రచారం చేస్తున్నారు. మన తీసుకునే ఆహారమే మన లివర్ ఆరోగ్యాని కి లేదా అనారోగ్యానికి హేతువుగా మారుతుందని గమనించాలి. ఆల్కహాల్ సేవనం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, స్థూలకాయం, అనవసర ఔషధాల దుష్ప్రభావం, జన్యుపరమైన అంశాలు, దీర్ఘకాలిక అనారోగ్యాల కారక జీవనశైలి లాంటి అంశాలు కాలేయ అనారోగ్యానికి హేతువులు. దురలవాట్లు పెరిగి పెరిగి ఫ్యాటీ లివర్, హెపటైటిస్ (కామెర్లు), లివర్ ఫెయిల్యూర్, లివర్ క్యాన్సర్, లివర్ సిర్రోసిస్ లాంటి ప్రాణాంతక కాలేయ అనారోగ్యాలు కలుగుతాయి. చెడు అలవాట్లు మితిమీరి చర్మం/కళ్లు పసుపు పచ్చగా మారడం, కడుపు నొప్పి లేదా వాపు రావడం, అకారణంగా బరువు తగ్గడం, ఆకలి మందగించడం, మూత్రం ముదురు పసుపు రంగులోకి మారడం, చర్మ దురద లాంటి పలు రోగ లక్షణాలు కనిపిస్తాయి. మన జీవనశైలిలో పలు మార్పులు చేసుకొన్నపుడు మన కాలేయం ఉత్తేజితమౌతుంది. ఆరోగ్యం సమకూరుతుంది. నిత్యం శారీరక వ్యాయామం, శరీర బరువును అదుపులో ఉంచుకోవడం, ఆల్కహాల్ సేవన దురలవాటుకు దూరంగా ఉండడం, విష పదార్థాలకు ఎక్స్‌పోజ్ కాకుండా ఉండడం లాంటి అంశాలు మన కాలేయ ఆరోగ్యానికి పునాదులుగా మారతాయి. సమతుల పోషకాహారం తీసుకోవడంతో లివర్ సంబంధ అనారోగ్యాలైన కాలేయ వాపు, కాలేయ రుగ్మతలు పూర్తిగా పలుచబడి మానవ శ్రేయస్సుకు ఊతం ఇస్తాయి.

# ప్రముఖ బ్రాండ్ టూత్‌పేస్ట్‌లలో హానికారక పదార్థాలు..

## ల్యాబ్ పరీక్షల్లో దిగ్భ్రాంతికర ఫలితాలు..!



న్యూఢిల్లీ : సురక్షితం లేదా ప్రకృతి సిద్ధం అంటూ నిత్యం ఆకట్టుకునే ప్రకటనలు గుప్పించే డజన్ల కొద్దీ టూత్‌పేస్ట్ బ్రాండులలో చాలా వరకు సీసం, ఆర్సెనిక్, పాదరసం, కాడ్మియంతోసహా ప్రమాదకర భార లోహాలు ఉన్నాయన్న వాస్తవం తాజా పరిశోధనలో బయటపడింది. లాడ్ సేఫ్ మామా సంస్థ 51 టూత్‌పేస్టు, టూత్ పౌడర్ ఉత్పత్తులను థర్డ్–పార్టీ ల్యాబ్ పరీక్షలు నిర్వహించగా దిగ్భ్రాంతికర ఫలితాలు వెల్లడయ్యాయి. 90 శాతం ఉత్పత్తుల్లో సీసం ఉన్నట్లు వెల్లడి కాగా దీర్ఘకాలం ఆరోగ్యంపై ప్రభావం చూపే హానికరమైన లోహమైన ఆర్సెనిక్ 65 శాతం ఉత్పత్తులలో ఉన్నట్లు తేలింది. అయితే, ఆరోగ్యానికి హాని చేసే వీటిపై ఎవరికీ ఆందోళన లేకపోవడం ఆశ్చర్యకరమని లీడ్ సేఫ్ మామా వ్యవస్థాపకురాలు తమారా రూబిన్ పేర్కొన్నారు. క్రెస్ట్, సెన్సోడైన్, కోల్గేట్, టామ్స్ ఆఫ్ మైనే తదితర బ్రాండ్లకు చెందిన పేస్టులు, పౌడర్లలో ఆందోళనకరమైన ఫలితాలు బయటపడ్డాయని ఆమె చెప్పారు. పిల్లల టూత్‌పేస్టులు సైతం: పిల్లలు వాడే టూత్‌పేస్టు బ్రాండ్లలో సగం వరకు(47శాతం)పాదరసం ఉన్నట్లు పరీక్షలో తేలిందని రూబిన్ చెప్పారు. 35 శాతం పిల్లల బ్రాండ్లలో మరో ప్రమాదకర భార లోహం కాడ్మియం ఆనవాళ్లు కనిపించాయని తెలిపారు. కొద్దిపాటి సీసం కూడా తీవ్ర ఆరోగ్య సమస్యలను సృష్టించగలదని ఆమె చెప్పారు. సీసం వల్ల ఆరేండ్ల లోపు పిల్లలలో బాగు చేయలేనంత మానసిక, ఆరోగ్య సమస్యలు వస్తాయని, వాటి పరిమాణం పెరిగితే అది ప్రాణనష్టం కూడా చేకూర్చగలదని ఆమె ఆందోళన చెందారు.

ఏ బ్రాండ్లు హానికరం?: ప్రయోగశాలలో నిర్వహించిన పరీక్షలలో అనేక ప్రముఖ బ్రాండ్లకు చెందిన టూత్‌పేస్టులు హానికరమని తేలింది. వీటిలో ఆర్గానిక్ లేదా డాక్టర్లచే సిఫార్సు చేయబడిన అంటూ ప్రకటనలు ఇచ్చేవి కూడా ఉండడం విశేషం. క్రెస్ట్, సెన్సోడైన్, టామ్స్ ఆఫ్ మైనే, కోల్గేట్, డాక్టర్ బ్రానర్స్ డేవిడ్స్, డాక్టర్ జెన్, డాక్టర్ బ్రైట్ మొదలైనవి ఈ హానికర బ్రాండ్ల జాబితాలో ఉన్నాయి. మీరేం చేయాలంటే: టూత్‌పేస్టులను కొనేముందు దానిపైన ప్రకృతి సిద్ధమైన లేదాఫ్లోరైడ్ రహిత వంటి లేబుల్స్ ఉన్నవైతే అవి సురక్షితం అని పూర్తిగా భావించనవసరం లేదు. టూత్‌పేస్టులో ఉన్న పదార్థాలు ఏమిటో నిశితంగా చదవాల్సి ఉంటుంది.

# దెబ్బతీసిన అకాల వర్షాలు

వరంగల్ ,: ఉమ్మడి వరంగల్ జిల్లా మామిడి రైతులను అకాల వర్షాలు కోలుకోలేని దెబ్బ తీశాయి. వీచిన ఈదురుగాలులకు ఉమ్మడి జిల్లాలోని చాలా చోట్ల మామిడి కాయలు రాలిపోయాయి. పంట చేతికొచ్చే సమయంలో కాయలన్నీ నేలరాలడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలగా.. అధికారులు పంట నష్టంపై వివరాలు సేకరించే పనిలో పడ్డారుమామిడి తోటలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 34 వేల ఎకరాల్లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలోనే ఎక్కువ శాతం మామిడి తోటలు ఉన్నాయి.

ఈ జిల్లాలో మొత్తంగా 14,560 ఎకరాల మేర మామిడి తోటలు ఉండగా, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో 9,600, జనగామ జిల్లాలో 6,700, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,500, ములుగు జిల్లాలో 750 ఎకరాల పైగా మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఏటా పూత పూసింది మొదలు.. కాయలు కోతకు వచ్చే వరకు మామిడి రైతులుపెట్టుబడి రూపంలో రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. అయినా వాతావరణ పరిస్థితులు అనుకూలించక పూత రాలడం, అకాల వర్షాలు, వడగండ్ల వానలు దిగుబడిని చాలావరకు దెబ్బ తీస్తున్నాయి. ఫలితంగా ఏటా మామిడి రైతులకు నష్టాలే మిగులుతుం డగా, ఈసారి కూడా పరిస్థితి అలాగే ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీసం పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారుఇప్పటికే మామిడి పంట్ల సీజన్ నడుస్తుండ టంతో చాలా చోట్లా కాయలు కోతకు వచ్చాయి. ఈ క్రమంలోనే నాలుగైదు రోజుల కిందట ఉమ్మడి జిల్లాలోని మహబూబా బాద్, జనగామ, వరంగల్ జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

# పంటలపై ఆగని గజదాడులు




**కల్లూరు,తెలంగాణ దిశ:** పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. పాళెం, పాతపేట, ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో రాత్రి నుంచి వేకువజాము వరకు ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసింది. ముందుగా పాళెంలోని చలపతికి చెందిన అర ఎకరా వరి, సోమశేఖర్‌కు చెందిన అర ఎకరా టమోటా పంటను నాశనం చేశాయి. అక్కడినుంచి ఆవులపెద్దిరెడ్డి గారిపల్లె సమీపానికి చేరుకుని నాగరాజుకు చెందిన అర ఎకరా వరిని తొక్కేశాయి. తర్వాత పాతపేట పంచాయతీ పూరేడువారిపల్లె వద్దకెళ్లి సత్యనారాయణకు చెందిన 50 అరటిచెట్లు, 10 కొబ్బరిచెట్లు, పశుగ్రాసం, వాసుకు చెందిన అర ఎకరా వరిని ధ్వంసం చేశాయి. కల్లూరులోని శ్రీనివాసులు కు చెందిన 5 మామిడిచెట్లు, రైతు మురళికి చెందిన 3 కొబ్బరిచెట్లను విరిచేశాయి. పాతపేట సమీపంలోని చాకిరేవు వంక వద్దకు చేరుకుని పగలంతా తిష్ఠ వేశాయి. ఈ ఏనుగుల గుంపును సదుం మండలం మీదు గా పలమనేరు కౌండిన్య అడవివైపు మళ్లించాలని ఎఫ్ఆర్‌వోలు థామస్ సుకుమార్, బాలకృష్ణారెడ్డి, డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్ఎసవో షఫీ, ఎఫ్‌బీవోలు మున్నా, శ్రీదేవి తమ సిబ్బందితో ప్రయత్నం చేశారు. అయితే సాయంత్రానికి మళ్లీ పులిచెర్ల మండలం వైపు అడుగుల వేశాయి. అటవీశాఖ అధికారులు టపాకాయలు కాల్చినా రాత్రి ఏడు గంటలసమయానికి కల్లూరు సమీపంలోని ఎద్దలవారిపల్లె వద్దకు చేరుకున్నాయి. కల్లూరు సమీపానికి ఏనుగుల గుంపు రావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ రాత్రికి పాళెం పంచాయతీ సమీపంలోని తూర్పు అటవీ విభాగంలోకి ఏనుగుల గుంపును రానీ యకుండా అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

# కుంకీలతో గజదాడులను అరికడతాం



కల్లూరు, : జనావాసాలు, పంట పొలాలపై ఏనుగుల దాడులను అరికట్టేం దుకు త్వరలో కుంకీ ఏనుగులతో రక్షణ చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వైల్డ్‌లైఫ్ అజయ్‌కుమార్ నాయక్, తిరుపతి చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం తెలిపారు. పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ సమీపంలోని తూర్పు అటవీ ప్రాంతాన్ని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వోలు భరణి, వివేక్, జగన్నాథసింగ్‌లతో కలిసి వారు పరిశీలించారు. పలమనేరు కౌండిన్య అటవీప్రాంతం నుంచి రెండేళ్ల క్రితం పులిచెర్ల మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో ఏనుగులు దాడులు చేస్తున్న తీరు, అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఏనుగుల గుంపు సంచరించే అటవీ ప్రాంతాలను మ్యాప్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ఏనుగుల గుంపు జనారణ్యంలోకి వస్తుండడంతో జరుగుతున్న నష్టంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింద న్నారు. గజదాడులను కుంకీ ఏనుగుల సాయంతో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఏనుగుల గుంపును కౌండిన్య అటవీప్రాంతం వైపు తీసుకెళ్లేందుకు కుంకీ ఏనుగులను తీసుకొస్తామని తెలిపారు. ఫ్లయింగ్‌స్కాడ్ డీఎఫ్‌వో గురుప్రభాకర్, మదనపల్లె సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, ఎఫ్ఆర్‌వోలు థామస్ సుకుమార్, ప్రియాంక, వేణుగోపాల్, మాధవి, ఫ్లయింగ్ స్కాడ్ ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్,
డిప్యూటీ రేంజర్ కుప్పుస్వామి, ఎఫ్ఎస్‌వో మహ్మద్ షఫీ, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు. పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీలో శుక్రవారం రాత్రి పంటలపై గజదాడులు కొనసాగాయి. కొబ్బరి, వరి, మామిడి పంటలకు అపారనష్టం వాటిల్లింది. కుమ్మరపల్లిలో సి. కృష్ణయ్యకు చెందిన 11 కొబ్బరిచెట్లు, 3 మామిడిచెట్లు, ఎం. కృష్ణయ్యకు చెందిన 3 మామిడిచెట్లతో పాటు పశుగ్రాసాన్ని ఏనుగులు ధ్వంసం చేశాయి. వంకాయలపాటివారిపల్లిలో రవీంద్ర నాయుడికి చెందిన ఎకరా వరిపంటను ధ్వంసం చేసిన ఏనుగులు 20 మామిడిచెట్లను విరిచేశాయి.

# మనసు పెడితేనే మహిళా మార్టులు!



**అనంత,తెలంగాణ దిశ:**మహిళా మార్టులు ఈ మధ్య తరచుగా వినిపిస్తున్న పేరు. ప్రభుత్వ భవనంలో కొన్ని మార్టులు ఏర్పాటు చేసి వాటిని డ్వాక్రా గ్రూపులకు అప్పగించి వారి ఉత్పత్తులను అమ్ముకొనేలా రూపొందించి వారి అభివృద్ధికి బాటలు పరిచేలా చేయడమే వీటి ఉద్దేశం. అనంతలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా మహిళా మార్టులు ఏర్పాటు చేయడానికి అన్ని వనరులు ఉన్నా ఇప్పటి దాకా అధికారులు ఆదిశగా కదలిక లేదు. తాజాగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నగరంలో మహిళా మార్టులు ఏర్పాటు చేయబోతున్నామని చెప్పడంతో ఈ అంశం ఆసక్తికరంగా మారింది. అనంతపురంలో ప్రభుత్వ భవనం ఉంటే మహిళలకు ఉచితంగా ఇచ్చి అక్కడ మార్టు ఏర్పాటు చేయడానికి తన సహకారం అందిస్తానని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మెప్మా అధికారులను సైతం ఆదేశించడంతో అధికారులు స్థలం అన్వేషణ చేస్తున్నారు. అనంతపురం నగరంలో పేద, మధ్య, సంపన్న మహిళలు సైతం డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే సంఘాల్లో సభ్యులుగా ఉండటంతో మనసు పెడితే నగరంలోని పలు ప్రాంతాల్లో కనీసం 10 మార్టులు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అనంతలో మార్టు ఏర్పాటు చేయడానికి అవకాశం ఉన్నా వైకాపా హయాంలో ఒక్కటీ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం చొరవ చూపితే ఏర్పాటు సాధ్యం అయ్యే అవకాశం ఉంది. డ్వాక్రా సంఘాలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ఆసక్తి చూపుతున్నారు. లక్ష్యాలు నిర్దేశిస్తుండటంతో రుణం సులభంగా ఇచ్చే అవకాశం ఉంది. బ్యాంకు లింకేజీ ద్వారా ప్రతి సంఘానికి రూ.10 లక్షలు ఇస్తున్నారు. మార్టు ఏర్పాటు చేస్తే అదనంగా రూ.20 లక్షలు ఇస్తారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు ఇచ్చిన రుణం ద్వారా రూ.30 లక్షలు తీసుకొని ఐక్యంగా ఉన్న కొన్ని సంఘాలను కనీసం నాలుగు సంఘాలు రూ.1.20 కోట్లు ఖర్చు చేస్తే ఒక్కో చోట ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఇందుకు ఐక్యత, నిబద్ధత, అధికారుల ప్రోత్సాహం ఉంటేనే సాధ్యం అవుతుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండేళ్ల క్రితమే రెండు మహిళా మార్టులు ఏర్పాటు చేశారు. నార్పలలో ఏర్పాటు చేసిన మహిళా మార్టు ఆశావహంగా సాగుతోంది. ఇక్కడ మండలంలోని మహిళలు అంతా కలిసి ఒక్కో సంఘం సభ్యురాలి నుంచి రూ.200 నుంచి రూ.300 వరకు మహిళా మార్టుకు చెల్లించి సభ్యులు అంతా కలిసి కో ఆపరేటివ్ సొసైటీగా ఏర్పాటు చేసుకోవడంతో అందరూ భాగస్వాములు అవుతారు. మహిళా సంఘంలోని సభ్యులే సరకులు కొనుగోలు చేయడం, నిత్యం మార్కెట్‌కు అనుగుణంగా ధరలు నిర్ణయించి ఇతర ప్రైవేటు వాటి కంటే తక్కువ ధరకు అంటే కొంతవరకు మాత్రమే లాభం ఉంచుకొని విక్రయాలు చేస్తారు. రెండేళ్లకే ఆయా మహిళా గ్రామైక్య సంఘాలకు రూ.8.78 లక్షలు ఆదాయాన్ని జమ చేశారు. బత్తలపల్లిలో ఉన్న మహిళా మార్టును సక్రమంగా నిర్వహించుకోలేక పోవడంతో కనీసం బ్యాంకుకు సక్రమంగా రుణం చెల్లించలేని పరిస్థితి ఉంది. నిబద్ధత, మార్కెట్‌కు అనుగుణంగా, అధికారుల నిత్యం పరిశీలనతో మార్టు నిర్వహిస్తేనే లాభాల బాటలో పయనిస్తుందనడంలో నార్పలలోనే మార్టు నిదర్శనం.

# రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం: కలెక్టర్



**హిందూపురం,తెలంగాణ దిశ:**ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు, సర్జన్, స్పెషలిస్టుల సేవలు, ఎన్టీఆర్ వైద్యసేవలు సమర్థంగా సద్వినియోగం చేసుకొని రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకొంటామని జిల్లా కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలోని సమావేశ భవనంలో తొలి హెచ్‌డీసీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్‌తోపాటు డీసీహెచ్ఎస్ ఉపేంద్రనాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్న, ఆర్ఎంవో డేవిడ్‌రాజు, హెచ్‌డీసీ సభ్యులు విద్యాసాగర్, ప్రభుకుమార్, శ్రీదేవీ పాల్గొని ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన విషయాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో వ్యాధి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలన్నదే అందరి సంకల్పమన్నారు. దీనికి ఉన్న సౌకర్యాలేమిటి, ఇంకా ఎలాంటి సదుపాయాలు అవసరం, అనే విషయాలపై సమావేశంలో కమిటీ సభ్యులు, తాము చర్చించామన్నారు. హెచ్‌డీసీ నిధులు మంజూరయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆసుపత్రికి ప్రసవానికి వచ్చిన వారిని పూర్తిగా పరిశీలించి ఇక్కడ వైద్యసేవలు అందించేందుకు అవసమైన సౌకర్యాలు లేని సమయంలో మాత్రమే ఇతర ప్రాంతాలకు రెఫర్ చేయాలని, దీనిపై వైద్యులకు సూచనలివ్వాలని కలెక్టర్ సూపరింటెండెంట్‌కు సూచించారు. ఆసుపత్రిలో వైద్యసేవలు కొలిక్కి తీసుకొస్తామని అందులో భాగంగానే ఆర్డీవో తాను ఆసుపత్రిని తనిఖీ చేస్తున్నామన్నారు. సాయంత్రం వేళల్లో ఓపీకి వైద్యులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులకు హాజరుకాకుండా ఇద్దరు వైద్యులు జీతం తీసుకొంటున్నారని విలేకరులు కలెక్టర్‌తో ప్రస్తావించగా దీనిపై నివేదిక అందించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల కౌంటర్, మాతాశిశు ఆసుపత్రిని పరిశీలించి ఫీడింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని సూపరింటెండెంట్‌కు సూచించారు.

# అందని సాగునీరు..

**గోవిందరావుపేట,తెలంగాణ దిశ:**లక్నవరం జలాశయంలో సమృద్ధిగా సాగు నీరు ఉన్న గోవిందరావుపేట మండలంలోని ఆయకట్టు రైతులకు అందని దుస్థితి నెలకొంది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 33.5 అడుగులు (1.945 టీఎంసీలు) దాటి ప్రవహించి ఇటీవల మత్తడి పోసింది. వర్షాలు తగ్గడంతో పంటలు ఎండిపోతున్నాయి. ప్రధాన కాల్వలో పూడిక, పిచ్చిమొక్కలు పెరగడంతో కాల్వల నుంచి నీరు రాక రైతులు అవస్థలు పడుతున్నారు. దీంతో చేసేది లేక మూడేళ్లుగా రైతులందరూ చందాలు వేసుకొని కాల్వల్లో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేస్తున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదు. జలాశయంలో సాగుకు సరిపడా నీరు ఉన్న కాల్వల నుంచి నీరు అందక చాలా చోట్ల పొలాలు బీటలు వారుతున్నాయి. లక్నవరం జలాశయానికి ఐదు ప్రధాన కాల్వలు ఉన్నాయి. రంగాపూర్, నర్సింహుల, 1, 2, కోట కాల్వ, శ్రీరాంపతి కాల్వలు ఉన్నాయి. ప్రధాన కాల్వల్లో పూడిక, పిచ్చి మొక్కలు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. గతంలో రైతుల నుంచి నీటి తీరువా వసూలు చేసి కొంత మొత్తం కాల్వల నిర్వహణకు కేటాయించేవారు. దానిని రద్దు చేయడంతో సమస్య తీవ్రమైంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రధాన కాల్వల పూడికతీత పనులకు నిధులు కేటాయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## దళారులు చెప్పిందే ధర..

# కర్షకుడి ఇంట కన్నీటి ధార



**కొత్తచెరువు,తెలంగాణ దిశ:**జిల్లాను కొద్దిరోజులుగా వరుణుడు వీడటం లేదు. రోజూ ఏదో ఒక సమయంలో పలకరిస్తూనే ఉన్నాడు. కర్షకులకు కన్నీరు మిగిలిస్తున్నాడు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు చేతికి వచ్చే సమయంలో వరద కారణంగా దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టుబడి కూడా చేతికి అందకపోతే ఎలాగని కన్నీరు మున్నీరవుతున్నారు. వర్షాలకు వేరుసెనగ, మొక్కజొన్న, పత్తి, కంది, టమాటా తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, విక్రయించుకునేందుకు మార్కెట్ సౌకర్యం లేక దళారులు చెప్పిన ధరకే విక్రయించు కోవాల్సిన పరిస్థితి వచ్చింది. పంటలు వర్షానికి తడిసిపోవడం, మొల్లకెత్తడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించకపోవడంతో దళారులు రంగ ప్రవేశం చేసి, నచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారు. తుకాల్లో సైతం మోసాలు చేస్తూ మరింత నష్టం మిగిలిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇటీవల కురిసన వర్షాలకు 1,488 హెక్టార్లలో పంట దెబ్బతిందని అధికారులు నివేదికలు రూపొందించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం 2,44,763 హెక్టార్లు ఉండగా, 1,49,242, హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇందులో 1488 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. జిల్లాలో వేరుసెనగ 580 ఎకరాలు, వరి 612, జొన్న 64, మొక్కజొన్న 127, కొర్ర 24, కంది 34, పత్తి 41, సామ 4, పొగాకు 2 చొప్పున ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. జిల్లాలో ప్రధానంగా వేరుసెనగ 1,74,910 హెక్టార్లలో, వరి 5,031, కంది 26,528, ఉలవ 9,193, జొన్నలు 1,418, సజ్జలు 904, మొక్కజొన్న 15,221, కొర్ర 667, పెసలు 1046, అలసంద 924, ఆముదం 3,230, పత్తి 2,339 హెక్టార్లలో పంటలు సాగు చేశారు. తీరా చేతికి వచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో పంటలు నిల్వ చేసేందుకు సౌకర్యం లేక తడిసి దెబ్బతిన్నాయి. 45 కేజీల వేరుసెనగ బస్తా రూ.2500లకే, మొక్కజొన్న క్వింటా రూ.2000లకే దళారులకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కొత్తచెరువు మండలం ఇరగంపల్లికి చెందిన రైతు రామలింగం మూడెకరాల్లో వేరుసెనగ సాగు చేశారు. తుపానుకు ముందే రెండెకరాల్లో పంట తొలగించారు.
ఎకరాలోని పంట తొలగించి పొలంలో ఉన్నప్పుడే తుపాను పట్టుకుంది. నాలుగైదు రోజులపాటు ఎడతెరిపిలేని వర్షంతో పొలంలో కాయలు తడిసిపోయాయి. దీంతో వేరుసెనగ కట్టె కుళ్లిపోగా కాయలు రంగుమారి, మోసులెత్తాయి. ఎకరాలో పండిన వేరుసెనగ కాయలు విడిపించటానికి రూ.పదివేల కూలి భరించాల్సి వచ్చింది. దెబ్బతిన్న దిగుబడులను కొనుగోలు చేయటానికి వ్యాపారులు ముందుకు రాని పరిస్థితి. పెట్టుబడీ దక్కడం లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# విభిన్న ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్



**అనంత ,తెలంగాణ దిశ:**బుక్కరాయ సముద్రంలో గంగేశ్వరి నిర్వహిస్తున్న ఫ్లోర్ క్లీనింగ్ యూనిట్‌ను పరిశీలిసున్న డీపీఎం గంగాధర్ పరిశ్రమలు పెట్టి ఉత్పత్తులను సులువుగా తయారు చేసినా మార్కెటింగ్ చేయడం కష్టతరమయ్యేది. డ్వాక్రా మహిళా గ్రూపులు తయారు చేసిన వాటికి సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉండేది కాదు. దీంతో విభిన్నంగా ఉన్నా స్థానికంగానే విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించారు. పలు సరికొత్త మార్కెటింగ్ విధానాలను తెరపైకి తీసుకొచ్చి మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దే దిశగా తొలి అడుగుపడింది. ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించి.. ఈ-కామర్స్‌లో విక్రయించు కొనే విధంగా అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సెర్ప్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా అధికార యం త్రాంగం కసరత్తు ప్రారంభించింది. గృహాలంకరణ వస్తువులు, తినుబం డారాలు ఏవైనా గ్లోబల్ మార్కెట్‌లో ప్రవేశించాలంటే ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వేదిక ద్వారా సాధ్యం. ఈ విధానంలో ఇంట్లో నుంచే విక్రయాలు సాగించవచ్చు. ప్రస్తుతం లావాదేవీలు ఆన్‌లైన్ డిజిటల్ తరహాలో ఉన్నాయి. గార్లదిన్నె, నార్పల, రాప్తాడు, బుక్కరాయ సముద్రం, అనంతపురం, డి.హీరేహాళ్, యాడికి, కంబదూరు, పామిడి తదితర ప్రాంతాల్లో వేరుసెనగ, ఆముదం, సన్‌ఫ్లవర్ నూనెలు, పట్టు చీరలు, వాటర్ బాటిళ్లు, డోర్ కర్టెన్లు, గార్మెంట్స్, ఫినాయిల్, స్వీట్లు, బిస్కెట్లు, మిల్లెట్స్, ఫ్లోర్ క్లీనర్ టూవీలర్ బ్యాగులు, లెదర్ బొమ్మలు, బెల్లం, మసాల పౌడర్లు గుర్తించారు. నాణ్యత, నవ్యతతో కూడిన ఉత్పత్తు లకు ఎక్కడైనా డిమాండ్ ఉంటుంది. పలు రకాల ఉత్పత్తులు మంచి గుర్తింపు వస్తోంది. గార్లదిన్నెలో చిరుధాన్యాలతో తయారు చేసిన రాగి మాల్టు, చిక్కీలు, నిప్పట్లు ఇప్పటికే ఓఎన్‌డీసీలో పొందుపరిచారు రుద్రంపేటలో తయారు చేసే గిఫ్టులు, గృహ అలంకరణ వస్తువులను ఆన్‌లైన్‌లో ఉంచారు. రాప్తాడు మండలంలో బిస్కెట్లు తయారీలో మహిళలు ముందుంటున్నారు. జన్మభూమి నగర్‌కు చెందిన ముత్యాలమ్మ మహిళా సంఘం సభ్యురాలు సుమియా డోర్ డెకరేషన్ ఫ్లవర్స్‌ను ఉత్పత్తి చేస్తూ అమ్మకాల్లో ముందుంటోంది.

# బాధ్యత తీసుకోండి...బాగు చేయండి



**అనంతపురం,తెలంగాణ దిశ:**కరవు జిల్లాలో 1.45 లక్షల ఎకరాలకు సాగునీరు, 10 లక్షల మందికి తాగునీరు అందించే తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ఆధునికీకరణ పనులను గత వైకాపా ప్రభుత్వం అటకెక్కించింది. ఐదేళ్లలో కనీసం తాత్కాలిక మరమ్మతులూ చేయించలేదు. డిస్ట్రిబ్యూటరీలు, పంట కాలువల్లో కంపచెట్లు పెరిగి నీరు చివరి ఆయకట్టుకు అందని పరిస్థితి నెలకొంది. ప్రధాన కాలువ ఎక్కడికక్కడ గండ్లుపడి బలహీనంగా మారింది. ఫలితంగా తుంగభద్ర నీరు 2,600 క్యూసెక్కులకు గాను 1,800 క్యూసె క్కులే తీసుకుంటున్నారు. తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆధునికీకరణ పనులపై రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి వేగంగా ఆధునికీకరణ పనులు చేపట్టాల్సిన బాధ్యత కూటమి ప్రజాప్రతినిధులపై ఉంది. ఇప్పుడు ప్రయత్నాలు మొదలుపెట్టి వచ్చే వేసవిలో పనులు జరిపించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గడిచిన ఐదేళ్లలో నిర్వహణ లేకపోవడంతో ప్రధాన కాలువలపై ఉన్న వంతెనలు చాలావరకు కూలిపోయాయి. అక్కడ క్కడ గండ్లు పడి కట్ట బలహీనంగా తయారైంది. తూములు ధ్వంసమయ్యా యి. ప్రధాన కాలువపై అత్యవసరంగా చేపట్టాల్సిన 11 పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆయా పనులపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో చర్చలు జరిపారు. ఈక్రమంలో రూ.35 కోట్లు విలువైన పనులకు జల వనరుల శాఖ అనుమతులు మంజూరు చేసింది. టెండర్లు ఖరారు చేసి వచ్చే ఏడాది జనవరి నుంచి పనులు మొదలుపెట్టే అవకాశం ఉంది. రూ.35 కోట్లతో కణేకల్లు చెరువు 3వ తూము, పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంలకు సంబంధించిన రెగ్యులేటర్లు, అండర్ టన్నెళ్లు, 5 వంతెనలు, 15 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు చేపట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు మాత్రమే అనుమతులు ఇచ్చింది. ఆధునికీకరణకు శాశ్వతప్రాతిపదికన పనులు పూర్తి చేస్తేనే ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రజాప్రతినిధులు ఆ దిశగా చొరవ చూపాల్సి ఉంది. 2007లో రూ.463 కోట్ల అంచనాతో ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. ఆరు ప్యాకేజీలుగా విభజించి 2019 నాటికి 67 శాతం పూర్తి చేశారు. ధరలు పెరగడంతో మిగిలిన పనులు పూర్తిచేయడానికి అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించాం. టెండరు ప్రక్రియ పూర్తయ్యాక వేగంగా పనులు జరిగేలా చొరవ చూపుతాం. ఆరు ప్యాకేజీల పరిధిలో ఆధునికీకరణ పనులకు సంబంధించి అంచనాలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం నుంచి ఆమోదం తీసుకుని వీలైనంత వేగంగా పనులు మొదలుపెడతాం. ప్రధాన కాలువను పటిష్టం చేసి ఆయకట్టులోని ప్రతి ఎకరాకు నీరిచ్చే బాధ్యత తీసుకుంటాం.

# పల్లె చిత్రం.. మారుతోంది



**సూళ్లూరుపేట,తెలంగాణ దిశ:**జిల్లాలోని 34 మండలాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ మేరకు జిల్లాలో రూ.3,907.10 లక్షలతో 911 పనులు చేపట్టారు. ఈనెల 14 నుంచి 20 తేదీల మధ్య ప్రతి పంచాయతీలో పల్లె పండగ పేరుతో భూమిపూజ చేశారు. అనంతరం పనులు పట్టాలెక్కిస్తుండటంతో గ్రామాల్లోని వీధులు చాలావరకు సీసీ రోడ్లుగా రూపుదిద్దుకుంటున్నాయి. పనులన్నింటినీ సంక్రాంతిలోగా పూర్తిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటికే ఆదేశించారు. పర్యవేక్షణ బాధ్యత పంచాయతీరాజ్ ఇంజినీర్లకు అప్పగించారు. గుత్తేదారులు సంబంధిత ఎంపీడీవోల వద్ద ఎంవోయూ చేసుకోవాల్సి ఉంది. పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. నాణ్యత నియంత్రణ విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, పరిశీలించనున్నారు. ఎప్పుడూలేని విధంగా ఈదఫా ఉపాధిహామీ పథకం చీఫ్ విజిలెన్సు ఆఫీసర్‌గా ఏఎస్పీ స్థాయి అధికారిని నియమించారు. ఎక్కడైనా నిధులను దుర్వినియోగం చేస్తే చీఫ్ విజిలెన్సు ఆఫీసర్ ఆధ్వర్యాన వారి బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోనుంది. నులన్నింటినీ సంక్రాంతిలోగా పూర్తిచేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటికే ఆదేశించారు. పర్యవేక్షణ బాధ్యత పంచాయతీరాజ్ ఇంజినీర్లకు అప్పగించారు. గుత్తేదారులు సంబంధిత ఎంపీడీవోల వద్ద ఎంవోయూ చేసుకోవాల్సి ఉంది. పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. పనులు ప్రారంభించాం .. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె పండుగ పేరుతో పనులు ప్రారంభించాం. గ్రామాల్లో రద్దీ ఉండి, ఇప్పటివరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోని రోడ్లను గుర్తించి, ఆ మేరకు సీసీ రహదారులు నిర్మిస్తున్నాం. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మాదే. చెల్లింపులు ఎంపీడీవో పరిధిలో జరుగుతాయి.



# సీటీ స్కాన్‌తో క్యాన్సర్!

## వయసు ఎంత తక్కువైతే ముప్పు అంత ఎక్కువ తాజా అధ్యయనం హెచ్చరిక

ఈస్ట్ ఆంగ్లియా (యూకే): మానవ శరీరంలో క్యాన్సర్‌ను కనుగొన డానికి సీటీ స్కాన్ నిర్వహిస్తారు. కానీ సీటీ స్కాన్ చేయడం వల్ల ఆరోగ్యంగాఉన్న వారికి సైతం క్యాన్సర్‌వచ్చే ప్రమాదమున్నదని తాజా అధ్యయనం వెల్లడించింది. ఆధునిక వైద్య పరిజ్ఞానంలో సీటీ స్కాన్ అనేదిఎంతో కీలకంగా మారిన సంగతి తెలిసిందే. సీటీ స్కాన్ చేయ డం ద్వారా శరీరంలోని రుగ్మతలను వేగంగా, సమగ్రంగా తెలుసుకొనే అవకాశం కలుగుతుంది. డాక్టర్లకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారింది. అయితే ఈ పరిజ్ఞానంపై అధికంగా ఆధారపడటం ప్రమాదకరం కావచ్చని ఈ అధ్యయనం హెచ్చరించింది. జామా ఇంటర్నల్ మెడిసిన్ పత్రికలో ఈ వివరాలు ప్రచురించారు.

**ఇదే రీతిలో కొనసాగితే..:** అమెరికాలో 2023లో నిర్వహించిన సీటీ స్కాన్‌ల కారణంగా లక్ష క్యాన్సర్ కేసులు అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నదని ఆ అధ్యయనం హెచ్చరించింది. సీటీ స్కానింగ్‌ల రేటు ఇప్పుడున్న రీతిలోనే కొనసాగితే.. కేవలం సీటీ స్కాన్‌ల కారణంగానే ప్రపంచవ్యాప్తంగా ఐదు శాతం క్యాన్సర్ కేసులు పెరగవచ్చని తెలిపింది. ఇది ఆందోళనకరమని పేర్కొంది. అమెరికాలో గత పదేండ్ల కాలంలో సీటీ స్కాన్‌ల సంఖ్య 30 శాతం పెరిగిందని తెలిపింది. ఒకేఒక్కసారి సీటీ స్కాన్ చేయడం వల్ల ముప్పు చాలా తక్కువగా ఉండవచ్చు తప్ప అసలు లేకుండా పోయే అవకాశం లేదని పేర్కొంది. రోగి ఎంత తక్కువ వయస్సువారైతే ముప్పు అంత అధికంగా ఉంటుందని తెలిపింది. సాధారణంగా వైద్యులు చిన్న పిల్లలకు సీటీ స్కాన్‌ను సిఫారసు చేయరు. 90 శాతం వరకు సీటీ స్కాన్‌లు వయోజనులపైనే జరుగుతున్న నేపథ్యంలో వారికే ముప్పు అధికంగా ఉంటుందని తెలిపింది.

**ఆ క్యాన్సర్ల ముప్పు..:** సీటీ స్కాన్ వల్ల ఊపిరితిత్తులు, పెద్ద పేగు, మూత్రాశయానికి క్యాన్సర్ సోకవచ్చని, లుకేమియా రావచ్చని, మహి ళలకు రొమ్ము క్యాన్సర్ ముప్పు ఉంటుందని ఆ అధ్యయనం వెల్లడించి ంది. ఇదే అంశంపై 2009లో జరిగిన ఒక విశ్లేషణలో సీటీ స్కాన్‌ల వల్ల 29 వేల క్యాన్సర్ కేసులు నమోదు కావచ్చని అంచనా వేశారు. కానీ తాజా అంచనా అంతకు మూడు రెట్లు ఉండటం ఆందోళనకరం. పరిస్థితి ఇలాగే కొనసాగితే మద్యం, అధిక బరువు వల్ల ఎదురయ్యే ముప్పుతో సమానంగా సీటీ స్కాన్ బాధితులు కూడా ఉండవచ్చని అంచనా వేసింది. శరీరంలోని ఏ భాగాన్ని స్కాన్ చేసినా ఒకే విధమైన ముప్పు ఉండకపోవచ్చునని, ఉదరం, కటి భాగాన్ని సీటీ స్కాన్ చేయడం వల్ల మాత్రం భవిష్యత్తులో క్యాన్సర్ సోకే అవకాశాలు ఎక్కువగా ఉ ంటాయని తెలిపింది. ఏడాది లోపు పిల్లల తలను సీటీ స్కాన్ చేయడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించింది.

**అవసరమైతే తప్ప సీటీ స్కాన్ వద్దు..:** సీటీ స్కాన్ వల్ల క్యాన్సర్ ముప్పు ఉన్నప్పటికీ ప్రాణాలు కాపాడటంలో ఆ పరిజ్ఞానం కీలకమని వైద్యులు పేర్కొంటున్నారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో రోగ నిర్ధారణకు సీటీ స్కాన్ దోహదపడుతుందని అంటున్నారు. తాజా హెచ్చరికల నేపథ్యంలో ఇకపై అవసరమైతే తప్ప వైద్యులు సీటీ స్కాన్‌ను సిఫారసు చేయకపోవడం మంచిదని ఆ అధ్యయనం సూచించింది. మరోవైపు సీటీ స్కాన్‌లు క్యాన్సర్ కారకాలని ఈ అధ్యయనం రుజువు చేయలేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ అధ్యయనంలోని అంచనాలన్నీ 'రిస్క్ మాడల్స్'పై ఆధారపడినవి తప్ప ప్రత్యక్ష ఆధారాలు కాదని అంటున్నారు. రేడియేషన్ వల్ల క్యాన్సర్ రావచ్చన్నది కొత్త ఆవిష్కరణ కాదని, ఆ ముప్పు మొదటి నుంచీ ఉన్నదని పేర్కొన్నారు.

# పెద్దపల్లిలో నేతల సైలెంట్...

కరీంనగర్, : పెద్దపల్లి జిల్లా అంటే గుర్తొచ్చేది ఇద్దరు నేతలు. ఒకరు గతంలో పదేళ్లపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న దాసరి మనోహర్ రెడ్డికాగా? మరొకరు ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయ రమణారావు.. గతంలో ఇద్దరూ ఇద్దరే అన్నట్లుగా వ్యవహరించేవారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ ఇద్దరి మధ్య మాటల యుద్ధం నడిచేది.నీ అవినీతి బాగోతం బయటకు తీస్తా అంటే?నీ అవినీతి అవినీతి బాగోతం కూడా బయటకు తీస్తానంటూ ఇద్దరు నిత్యం ఉ ప్పు-నిప్పులా ఉండేవారు. వీరిద్దరి మధ్య ఆరోపణలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో జిల్లా రాజకీయాలు హీటెక్కేవి. ఇదంతా 2023కు ముందు ఇద్దరి మధ్య జరిగిన పొలిటికల్ వార్. సీన్ కట్ చేస్తే.. 2023లో గులాబీ పార్టీ దారుణంగా ఓడిపోయింది.పదేళ్లపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా జిల్లాను ఏకచక్రాధిపత్యంగా ఏలిన దాసరి మనోహర్ రెడ్డి ఓడిపోయారు. కాంగ్రెస్ నేత చింతపల్లి విజయ రమణారావు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు.

కాలం మారింది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ గెలుపుతో పెద్దపల్లి జిల్లా రాజకీయాలు కూడా ఒక్కసారిగా మారిపోయాయి.అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు కయ్యానికి సై అంటూ కత్తులు దూసుకున్న ఇద్దరు నేతలు ఇప్పుడు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న మనోహర్ రెడ్డి ఒక్కసారిగా దూకుడు తగ్గించారు. పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారట. ఏదైనా పార్టీ ప్రోగ్రామ్స్ ఉంటే అంటీముట్టనట్లుగా వ్యవ హరిస్తున్నారంట. అంతేకాదు క్యాడర్ కు సైతం అందుబాటులో ఉ ండడంలేదట. రాజకీయంగా మునుపటిలా దూకుడును ప్రదర్శిం చడంలేదట.ప్రత్యర్థులపై చేసే విమర్శల్లో వాడీవేడి లేకుండా చప్పగా సాగుతున్నాయంట ఆయన ప్రెస్ మీట్లు. కనీసం పార్టీ కార్యక్రమాల్లో అయినా యాక్టీవ్ గా ఉంటున్నారంటే అదికూడా లేదట. ఒక్క ఓటమితో మనోహర్ రెడ్డి తీరులో ఇంతలా మార్పు వచ్చిందేంటి అంటూ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పదేళ్ల పాటు రాజ్యమేలిన మనోహర్ రెడ్డి.. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే పైన గానీ, కాంగ్రెస్ ప్రభుత్వంపైగాని పల్లెత్తు మాట కూడా అనకుండా ఎందుకు సైలెన్స్ గా ఉంటున్నారనేదే ఇప్పుడు ఎవరికీ అంతుచిక్కడంలేదట.మాజీ ఎమ్మెల్యే సైలెన్స్ పైనే పార్టీ నేతలు తలా ఒకరకంగా చర్చించుకుంటున్నారట. 2023కు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న మనోహర్ రెడ్డిపై.. చింతపల్లి విజయ రమణారావు నిత్యం ఏదో ఒక ఇష్యుపై ఆరోపణలు చేస్తుండేవారు.. భూ ఆక్రమణలు, అక్రమ దందాలపై బహిరంగంగానే విమర్శలు చేశారు. అయితే ఎన్నికల తరువాత ఇప్పుడు ఒక్కసారిగా సీన్ మారి పోయింది. పెద్దపల్లి ఎమ్మెల్యేగా చింతపల్లి విజయ రమణా రావు పెద్దపల్లి గెలవడంతో? మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మౌన ముద్రలోకి వెళ్లారు. అందుకు కారణం కూడా లేకపోలేదు అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు.ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కూడా మనోహర్ రెడ్డి భూ ఆక్రమణల భాగోతం బయట పెడతానంటూ ఎమ్మెల్యే విజయ రమణా రావు హెచ్చరించారు. బంధంపల్లి చెరువుతో పాటు, మనోహర్ రెడ్డికి సంబంధించిన స్కూళ్లు, హాస్టళ్ల లెక్కలు తీస్తానంటూ బహిరంగంగానే ప్రకటించారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యే పై విమర్శలు చేస్తే..తనకే నష్టం జరుగుతుందని భావించి మాజీ ఎమ్మెల్యే సైలెన్స్ అయ్యారనే గుసగుసలు జిల్లా రాజకీయవర్గాల్లో విన్పిస్తున్నాయి.ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత మనోహర్ రెడ్డి భూ ఆక్రమాణలు బయట పెడతా.. విద్యా సంస్థలను కొలిపిస్తానంటూ హాట్ కామెంట్స్ చేసిన ఎమ్మెల్యే విజయ రమణరావు కూడా ఒక్కసారిగా సైలెన్స్ అయ్యారంట. మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిపై ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే మౌనంపై వహించడం వెనుక ఏం జరిగి ఉ ంటుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిపక్ష నాయకుడి నుండి అధికారం చేపట్టే వరకు విజయ రమణ హెచ్చరికలకే పరిమితమవడం వెనుకున్న మతలబు ఏంటనే సందేహాలు జిల్లా రాజకీయ నేతల్లో వ్యక్తమవుతున్నాయంట.ఇద్దరి మధ్య రాజీ ఏమైనా కుదిరిందా అంటూ రకరకాల పొలిటికల్ గాసిప్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయంట. మరి భూ ఆక్రమణదారుల భరతం పడతానంటూ ఎమ్మెల్యే చేసిన శపథం.. మాజీ ఎమ్మెల్యే సైలెన్స్‌గా ఉండేంత స్థాయికి వెళ్లడం వెనుక ఏదో మతలబు జరిగే ఉంటుందం టూ పెద్దపల్లి రాజకీయ వర్గాలు సెటైర్లు వేసుకుంటున్నారట. మరి రాబోయే రోజుల్లో కూడా వీరిద్దరి మధ్య ఇలాగే సైలెన్స్ వాతావరణం కంటిన్యూ అవుతుందా లేక ఏదైనా వ్యవహారం బెడిసికొట్టి మళ్లీ మొదటికొస్తుందా అనేది వేచి చూడాలి.

## రోజూ బాదం తింటున్నారా..

# అయితే మధుమేహం అదుపులో ఉన్నట్టే!



న్యూఢిల్లీ: రోజూ బాదం తింటే ఆసియా భారతీయుల వంటి నిర్దిష్ట జనాభాల్లో మధుమేహం అదుపులోకి వస్తుందని తాజా పరిశోధన వ్యాసం తెలిపింది. బాదం, గుండె ఆరోగ్యంపై గతంలో ప్రచురితమైన పరిశోధనలను విశ్లేషించిన అంతర్జాతీయ బృందం.. బాదం చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించగలదని, ప్రయోజనకరమైన గట్ బ్యాక్టీరియాను పెంచగలదని పేర్కొంది.

షార్ట్-చైన్ ఫ్యాటీ యాసిడ్ల ఉత్పత్తిని బాదం పెంచుతుందని చెప్పింది. ఈ తాజా వ్యాసం కరెంట్ డెవలప్‌మెంట్స్ ఇన్ న్యూట్రిషన్ జర్నల్‌లో ప్రచురితమైంది. రోజూ బాదం తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ 5 యూనిట్లు తగ్గినట్టు పరిశోధకులు గుర్తించారు. అలాగే డయాస్టోలిక్ రక్త పోటు స్వల్ప స్థాయిలోనైనా చెప్పుకోదగ్గ విధంగా 0.17-1.3 ఎంఎంహెచ్‌జీ మధ్య తగ్గినట్టు గుర్తించారు. అదనపు కొవ్వు తగ్గేందుకూ బాదం సాయపడుతుందని తెలిసింది.

# రీల్ కోసం ఇంత బరితెగింపా!



బెంగళూరు: ఈ మధ్య కాలంలో చాలామంది సోషల్ మీడియాలో రాత్రికి రాత్రే స్టార్లు అవ్వాలనే కోరికతో ఉవ్విళ్లూరుతున్నారు. అందుకు కోసం ఎక్కడ పడితే అక్కడ రీల్ తీయడం, ఫోటోలు దిగడం వంటివి పనులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నారు. కొందరు అయితే ప్రాంక్ అనే నెపంతో దారిన పోయే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. యువత ప్రమాదకర విన్యాసాలలో పాల్గొంటూ, ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారు. రోడ్డుపై ఇష్టానుసారంగా డాన్స్‌లు చేస్తూ అల్లకల్లోలం చేస్తున్నారు. అచ్చం అలాంటి ఘటనే ఒకటి బెంగళూరు లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బెంగళూరులో రీల్ కోసం బిజీ రోడ్డు మధ్యలో కుర్చీలో టీ తాగాడు. అయితే ఆ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. కానీ, ఆ వీడియో చూసిన నెటిజన్లు ఇదేం పనిరా బాబు అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లల్లో శుభకార్యాలకో లేదా సందర్భానుసారంగా విషయాలను షేర్ చేసుకొవలేగాని ఇలా రోడ్డుపై, ప్రమాదకరమైన ప్రదేశాల్లో ఏంటా పిచ్చి వేషాలు అంటూ ఏకి పారేస్తున్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న నేపథ్యంలో యువకుడు ఇలా చేయడం పలువురు నెటిజన్లకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. 'జాగ్రత్త సుమా.. బెంగళూరు పోలీస్ మిమ్మల్ని గమనిస్తోంది' అంటూ పోలీస్ శాఖ ట్వీట్ చేసింది.

## వ్యవసాయాన్ని ముంచనున్న

# సోలార్ విద్యుత్ ప్రాజెక్టులు!



విద్యుత్ లేని ఆధునిక సమాజాన్ని ఊహించలేము. నిత్య జీవితంలో విద్యుత్ వాడకం పెరుగుతున్నది. దానికి తగ్గట్టుగా ఉత్పత్తి పెరగాలి. శాస్త్ర విజ్ఞాన పరిశోధనల ఫలితంగా గాలి, సూర్యరశ్మి, అణుశక్తితో విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. దేశంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్‌లో 72 శాతం బొగ్గుతో తయారయ్యేది. ఇది చాలా ఖర్చుతో కూడుకోవడమే కాక, పర్యావరణాన్ని కూడా దెబ్బతీస్తుంది. అందుకే గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. అందుకు ఎవరికీ అభ్యంతరం లేదు. అయితే ఈ గ్రీన్ ఎనర్జీ పేరుతో వ్యవసాయాన్ని బలి పెట్టడాన్ని ప్రశ్నించాలి. గ్రామీణ వ్యవస్థను తీవ్రంగా ఛిద్రం చేసే ఈ సోలార్ ఉత్పత్తి రాష్ట్రాభివృద్ధికా? కార్పొరేట్ల కోసమా? తక్కువ ఖర్చుతో ఉత్పత్తి అయ్యే గాలి, సూర్యరశ్మి విద్యుత్‌ను ప్రభుత్వం ఉత్పత్తి చేయకుండా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడం మోడీ పాలనా కాలంలో భారీగా పెరిగింది. అదానీ, అంబానీ, టాటా, బిర్లా లాంటి అతి పెద్ద కార్పొరేట్ కంపెనీలు సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోకి వచ్చి, కేంద్ర ప్రభుత్వ అండదండలతో రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి తమకు అనుకూలంగా విధానాలను అమలు చేయించుకునే స్థితికి చేరాయి. ఆంధ్ర రాష్ట్రాన్ని తమ ప్రయోగశాలగా మార్చుకున్నాయి. రాష్ట్రంలో వెనుకబడిన రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి చాటున లక్షల ఎకరాల భూములను ఈ కంపెనీలు కొనడం లేదా లీజు పద్ధతుల్లో స్వాధీనం చేసుకుంటున్నాయి. వ్యవసాయాన్ని ముంచేందుకు ఈ సోలార్ కంపెనీలు సిద్ధమవుతున్నాయి.

**కరువు జిల్లాల్లోనే సోలార్ ప్రాజెక్టులు ఎందుకు?:** ప్రజల జీవితాలను ఛిద్రం చేసే కరువును కూడా 'కొందరు' ప్రేమిస్తారని చాలా సంవత్సరాల క్రితం ప్రముఖ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ చెప్పారు. కరువును అవకాశంగా తీసుకుని పెద్ద ఎత్తున అవినీతికి, అక్రమాలకు పాల్పడే అధికారులు, పేదలకు ఇచ్చే బియ్యం అమ్ముకుని కార్లు, బంగ్లాలు కొనే రాజకీయ నాయకులు, కరువు పనుల పేరుతో చేయని పనులకు బిల్లులు పెట్టుకుని కొల్లగొట్టే కాంట్రాక్టర్లు కరువును ప్రేమిస్తారని ఆయన పరిశోధనాత్మకంగా విశ్లేషించారు. ప్రస్తుతం కార్పొరేట్ కంపెనీలు, ప్రభుత్వాలు కరువును ప్రేమిస్తున్నాయి. కరువు నుండి ప్రజలను కాపాడాల్సిన ప్రభుత్వాలు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా కార్పొరేట్ కంపెనీలను పెంచి పోషిస్తున్నాయి. భూముల నుండి రైతులను ఖాళీ చేయిస్తున్నాయి. రాయలసీమ, ప్రకాశం జిల్లాల్లో సగటు వర్షపాతం తక్కువగా వుంటుంది. అందువల్ల వేడి ఎక్కువగా వుంటుంది. సంవత్సరంలో సుమారు 324 రోజులు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఈ ప్రాంతంలో వుంది. ఇక్కడి పగటి వేడి, రాత్రి, పగలు వీచే గాలులు విండ్ మిల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అత్యంత అనుకూలంగా వున్నాయి. అందువల్ల సోలార్, గాలిమరల విద్యుత్ ఉత్పత్తి గత పది సంవత్సరాల్లో ఈ జిల్లాల్లో భారీగా పెరిగింది. అనంతపురం జిల్లాలో 2022-23 నాటికి డిస్కమ్ (డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్) పరిధిలో 3,755.26 మెగావాట్ల సోలార్ విద్యుత్, 3,693.55 మెగావాట్ల గాలిమరల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న సోలార్ విద్యుత్‌లో 89 శాతం అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోనే తయారవుతుంది. అనంతపురం జిల్లాలో 43 శాతం, కర్నూలు 28, కడప 18 శాతం సోలార్ ఉత్పత్తి అవుతుంది. నీటి పంపింగ్ ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే ఐదు హైడ్రో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను కూడా ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోనే ఏర్పాటు చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం జరిపిన అన్ని మంత్రివర్గ సమావేశాలు ఈ ప్రాంత భూములను సోలార్, విండ్ మిల్ కంపెనీలకు కేటాయించా యంటే కరువును వారు ఎంతగా ప్రేమిస్తున్నారో తెలుస్తుంది.ప్రస్తుతం రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న సోలార్, గాలిమరల విద్యుత్ ప్రాజెక్టులు కాకుండా అదనంగా మరో 38 గిగావాట్ల విద్యుత్‌ను సోలార్ ద్వారా ఉత్పత్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఒక గిగావాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి కావాలంటే 5 వేల ఎకరాలు కావాలి. అంటే 38 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి 1,90,000 ఎకరాలు భూమి కావాలి. ఇందుకోసం కర్నూలు జిల్లాలో 31,450 ఎకరాలు, అనంతపురం జిల్లాలో 29,983, కర్నూలు జిల్లాలో 29,549, ప్రకాశం జిల్లాలో 9,630 ఎకరాలు మొత్తం 1,00,612 ఎకరాల సర్వే పూర్తి చేశారు. ఇందులో అదానీ కంపెనీకి 75,000 ఎకరాలు, అంబానీ కంపెనీకి 46,555 ఎకరాల భూమిని ఇవ్వనున్నారు. ఇది కాకుండా అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో 10 వేలు, కళ్యాణదుర్గంలో 15 వేలు, పుట్టపర్తిలో 15 వేలు, రాప్తాడులో 5 వేల ఎకరాలు సేకరించనున్నారు. ఈ రకంగా భూములు సేకరించడాన్ని ప్రతిపక్షంలో వున్నప్పుడు విమర్శించిన తెలుగుదేశం ప్రస్తుతం అదే ఒప్పందాలను కొనసాగిస్తూ భూ సేకరణకు సిద్ధపడింది.

**లీజు పేరుతో భూముల సేకరణ:** సోలార్ కంపెనీలు ప్రారంభ రోజుల్లో భూములను కొనుగోలు చేసి విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేవారు. భూముల ధరలు పెరగడంతో పాటు కంపెనీలు కావాలనుకున్నంత భూమి ఒకే చోట సమీకరించుకోవడం కంపెనీలకు కష్టమైంది. దీంతో లీజు ఒప్పందాలు అని కంపెనీలు, ప్రభుత్వాలు కలిసి కొత్త అవతారం ఎత్తాయి. రెవిన్యూ శాఖ మరియు ఎన్.ఆర్.ఇ.డి.సి.ఎ.పి (న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా ప్రభుత్వం ఈ కంపెనీలకు సంపూర్ణంగా తోడ్పడుతున్నది. పంటలు పండకపోవడం, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో ఇప్పటికే కరువు జిల్లాల రైతులు వ్యవసాయం మీద విశ్వాసాన్ని కోల్పోయారు. నిరాశ, నిస్పృహలతో ఈ సోలార్ కంపెనీలకు లీజుకు ఇవ్వడానికి పోటీలు పడుతున్నారు. రైతులకు సాగునీరు ఇచ్చే అవసరం, గిట్టుబాటు ధరలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు లేకుండా పోతుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215